


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162






ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 279 | ఆదివారం 18 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,


# పులివెందులలో కాల్పులు..

## నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత



- పులివెందులలో స్థానిక ఎన్నికల నామినేషన్ల వద్ద ఉద్రిక్తత
- వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట
- జనాన్ని చెదరగొట్టేందుకు గాల్లోకి పోలీసుల కాల్పులు
- ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం
- ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడి

2లో

కడప జిల్లా పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో పులివెందులలో ఒక్కసారిగా కలకలం రేగింది.




# ఎల్ - నినో ఎఫెక్ట్

# జల వివాదాలపై తెలంగాణ కొత్త వ్యూహం

- సాగు, తాగునీటి అవసరాల కోసం
- ఏపీతో సమన్వయానికి మొగ్గు
- ముందుగా కృష్ణా.. ఆ తర్వాత గోదావరి జలాలపై దృష్టి
- చంద్రబాబుతో భేటీకి రేవంత్ సన్నాహాలు?
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం.. వివాదాల పరిష్కారానికి కొత్త ప్రతిపాదనలు

2లో

ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాల వినియోగంపై ప్రభుత్వం కొత్త వ్యూహాన్ని అనుసరించేందుకు సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో జల వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకునే దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు, సాగునీటి ప్రాజెక్టులు, నీటి విడుదలకు సంబంధించిన అంశాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు ప్రణాళికలపై దృష్టి సారిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మధ్య సమావేశం జరిగే అవకాశంపై ఆసక్తి నెలకొంది. అయితే, ఈ భేటీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కృష్ణా, గోదావరి జలాల పంపిణీ, ప్రాజెక్టుల అనుమతులు, నీటి లెక్కల పారదర్శకత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఎల్-నినో నేపథ్యంలో తెలంగాణ జల విధానంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో చూడాలి.

# ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు

## టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

2లో



# గెలిచే దమ్ములేకే జగన్ పాన్ ఇండియా రౌడీయిజం

- ఓటమి భయంతోనే జగన్ పాన్ ఇండియా రౌడీయిజం చేస్తున్నారని విమర్శ
- కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ నుంచి రౌడీలను దింపుతున్నారని వ్యాఖ్య
- తామే దాడులు చేసి టీడీపీపై నెట్టేందుకు జగన్ కుట్ర చేస్తున్నారని విమర్శ
- వివేకా హత్య తరహాలోనే ఇప్పుడు కూడా నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం
- పంజాబ్ రౌడీలను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారన్న ఎమ్మెల్యే

2లో



# ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

## చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటి



- ఏపీలో పర్యటించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం
- పులుల సంరక్షణ, అడవి దున్నల తరలింపుపై ఇరువురి మధ్య చర్చ
- త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని తెలిపిన పవన్ కల్యాణ్

2లో



# మిథున్ రెడ్డి ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలి




- పుంగనూరు ఘటనపై వైసీపీని టార్గెట్ చేసిన టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమ
- కుట్ర ప్రకారమే దాడులు చేసి నామినేషన్లను అడ్డుకుంటున్నారని ఆరోపణ
- టెర్రర్ చట్టం కింద కేసులు పెట్టాలని డిమాండ్

2లో

పుంగనూరులో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా జరిగిన హింసపై టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమ తీవ్రస్థాయిలో స్పందించారు. దాడులు, బెదిరింపులతో

# విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధా

- స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన తొలి జాబితా విడుదల
- విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరు ఖరారు
- ఏలూరు మేయర్ బరిలో రెడ్డి అప్పలనాయుడు
- 12 మున్సిపాలిటీలకు ఛైర్మన్ అభ్యర్థులను ప్రకటించిన పార్టీ
- పొత్తులో భాగంగా 4 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలలో జనసేన పోటీ

2లో

ఏపీలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ తన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. అధికార కూటమిలో పొత్తుల సర్దుబాటులో భాగంగా తమకు కేటాయించిన స్థానాల్లో పోటీ చేసే మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను శనివారం అధికారికంగా ప్రకటించింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ జాబితాను విడుదల చేశారు. రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న



విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరును జనసేన ఖరారు చేసింది. అదేవిధంగా ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా రెడ్డి అప్పలనాయుడును బరిలోకి దించుతున్నట్లు వెల్లడించింది.

# నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!

- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన



2లో

# ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు.ముందుగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన మోహన్ యాదవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. అనంతరం నేతలు కాసేపు ముచ్చటించారు.మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మోహన్ యాదవ్ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంరక్షణ చర్యలను బలోపేతం చేయడంపై మాట్లాడారు. అలాగే, జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్ నుంచి గౌర్ (అడవి దున్నలు)ను చీూ=కు తరలించే ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. ఈ సందర్భంగా త్వరలోనే తాను మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని పవన్ తెలిపారు. సమావేశం అనంతరం పవన్ కల్యాణ్.. మోహన్ యాదవ్‌ను ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించి, కొండపల్లి, శ్రీకాళహస్తి కళాకృతులతో పాటు అరకు కాఫీని బహూకరించారు. ప్రతిగా మోహన్ యాదవ్, శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదాన్ని పవన్‌కు అందజేశారు.

# గెలిచే దమ్ములేకే జగన్ పాన్ ఇండియా రౌడీయిజం:

స్థానిక ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసే, వైసీపీ అధినేత జగన్ 'పాన్ ఇండియా రౌడీయిజం' చేస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాల నుంచి గూండాలను రప్పించి విధ్వంసం సృష్టించడం, ఆ నెపాన్ని ప్రత్యర్థులపైకి నెట్టడం వైసీపీకి పరిపాటిగా మారిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. "దారుణాలకు పాల్పడటం, వాటిని ఇతరులపైకి తోసేయడం గొడ్డలి పార్టీకి పుట్టుకతో వచ్చిన విద్య. గతంలో వివేకానందరెడ్డిని హత్య చేసి, ఆ నెపాన్ని చంద్రబాబుపై నెట్టి 'నారాసుర రక్తచరిత్ర' అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించిన వ్యూహాన్నే జగన్ రెడ్డి నేటికీ కొనసాగిస్తున్నారు" అని బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. పుంగనూరు ఎంపీ మిథున్ రెడ్డి.. కర్ణాటక, తమిళనాడు నుంచి రాడ్లు, కర్రలతో గూండాలను రప్పిస్తుండగా, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పంజాబ్ నుంచి ఏకంగా తుపాకులతో రౌడీలను దింపుతున్నారని, ఇది పాన్ ఇండియా రౌడీయిజం కాక మరేమిటని ఆయన ప్రశ్నించారు. " వారి కార్లను వారే ధ్వంసం చేసుకుని, మా కార్యకర్తలపై దాడులకు తెగబడుతూ, తిరిగి మేమే అరాచకాలకు పాల్పడుతున్నట్లు బుకాయించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని జగన్ రెడ్డి బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని కుట్రలు పన్నుతున్నారు. రక్తంతో తడిచిన చేతులు ఎవరివో ప్రజలందరికీ తెలుసు" అని బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. పంజాబ్ నుంచి వచ్చిన రౌడీలను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారని, కూటమి కార్యకర్తలు చేతులు ముడుచుకుని కూర్చోబోరని, చట్టపరంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. నాటి రాజారెడ్డి నుంచి నేటి జగన్ రెడ్డి వరకు విధ్వంసాలు సృష్టించడమే వారి నైజమని, ఎన్నికల్లో బలం లేనప్పుడు భయపెట్టి గెలవాలనే వైఎస్ కుటుంబ విధానాన్ని ఇప్పుడు కూడా అమలు చేయాలని చూస్తే ప్రజలు తిరగబడతారని ఆయన హెచ్చరించారు.

## మిథున్ రెడ్డి ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలి

నామినేషన్ల ప్రక్రియను అడ్డుకునేందుకు వైసీపీ కుట్ర పన్నిందని ఆయన ఆరోపించారు. ఏకగ్రీవాలను నిరోధించేందుకు హింసను ఆశ్రయించడం వైసీపీకి అలవాటేనని, పుంగనూరులో అదే పునరావృతం చేశారని విమర్శించారు.ఒక్క నామినేషన్ కోసం వందలాది మంది ఎందుకు వచ్చారని బొండా ఉమ ప్రశ్నించారు. కార్లలో కత్తులు, కర్రలు, రాళ్లు తీసుకువచ్చి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని మండిపడ్డారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి హింసనే నమ్ముకున్నారని, కూటమి ప్రభుత్వంలోనూ తమ దాడులు కొనసాగుతాయనే సందేశం పంపారని ధ్వజమెత్తారు. మిథున్ రెడ్డి ఎంపీ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై టెర్రర్ చట్టం (టాడా) కింద కేసులు నమోదు చేయాలని కోరారు.బెదిరింపులకు పాల్పడే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఉమ హెచ్చరించారు. స్థానిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, పుంగనూరులో నామినేషన్ కేంద్రం వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఎంపీ మిథున్ రెడ్డి భారీ కాన్వాయ్‌తో రావడమే ఘర్షణలకు కారణమైందని పోలీసు వర్గాలు అధికారికంగా తెలిపిన విషయం తెలిసిందే. అయితే, తమ అభ్యర్థులు నామినేషన్ వేయకుండా టీడీపీనే కుట్రపూరితంగా దాడి చేసిందని వైసీపీ ఆరోపిస్తోంది. ఈ ఘటనలపై ఇరు పార్టీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి.

# నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్–జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. "ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!" అంటూ తన పోస్టును ముగించారు.

## ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు, అక్టోబర్ 17: నంది పత్రిక.** మున్సిపల్, జిల్లా పరిషత్,పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి., తెలిపారు.మున్సిపల్,జిల్లా పరిషత్,పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్,ఎలక్షన్ మెటీరియల్ పంపిణీ, మరియు కౌంటింగ్ కేంద్రాలను శనివారం రేపల్లె మండల పరిధిలోని చాదీ= ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల మున్సిపల్ హై స్కూల్ ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి. పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్, జిల్లా పరిషత్,పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలనిఎన్నికల సామగ్రిని సక్రమంగా పంపిణీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా చర్యలు, ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన వసతులు, సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు సూచించారు.ఎన్నికల నిర్వహణలో భద్రత, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట రేపల్లె ఆర్డీఓ బి.శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు,డి ఎస్పీ.అబ్దుల్ అజీజ్ తహశీల్దార్లు, యం పి డి ఓ తదితరులు ఉన్నారు.

# చెంపచెళ్లుమనేలా నానా నటనాశైలి!

'సాలా ఏక్ మచ్ఛర్, ఆద్మీ కో హిజ్డా బనా దేతా హై!'.. ఈ సినిమా డైలాగ్ ఎంతటి సెన్సేషన్ సృష్టించిందో తెలిసిందే. మనిషి బలహీనతలు తమ గౌరవాన్ని, బలాన్ని ఎలా హరించివేస్తాయో తెలియజెప్పే ఓ కఠోరసత్యాన్ని తన నటనాశైలితో చెంపచెళ్లుమనేలా చెప్పిన తీరు ప్రేక్షకులు ఎన్నటికీ మరిచిపోలేరు. కథావస్తువు ఒక్కటే సక్సెస్‌కు కారణం కాదు. సరైన నటీనటులు తోడైనప్పుడే సినిమా అయినా, నాటకమైనా చిరకాలం నిలిచిపోతుంది. రంగస్థలంపై తనదైన విభిన్న నటనాశైలితో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే అద్భుతమైన నటుడు నానా పాటేకర్. తండ్రి వ్యాపారంలో నష్టపోవడంతో, తిండి గడవని పరిస్థితుల్లో నానా పదమూడేళ్లకే పనిచేయడం మొదలుపెట్టారు. ముంబైలోని సినిమా థియేటర్లకు పోస్టర్లు గీస్తే ముప్పై ఐదు రూపాయలు వచ్చేవి. అలా పనిచేస్తూనే చదువును కొనసాగించారాయన. ఆ సమయంలో అవమానం, ఆకలి తనకు ఎంతో నేర్పించాయని, సమాజంలో భిన్న పాత్రలను అర్థం చేసుకోవడానికి ఏ యాక్టింగ్ స్కూల్‌కూ వెళ్లాల్సిన అవసరం రాలేదని అంటాడు నానా. ముంబైలోని రహేజా స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో, సర్ జె.జె.ఇన్‌స్టిట్యూట్ నుంచి అప్లైడ్ ఆర్ట్స్ (చిత్రకళ)లో పట్టభద్రుడయిన తర్వాత అడ్వర్టైజింగ్ ఏజెన్సీలో పనిచేస్తూ, రంగస్థలంపై తన ప్రయాణాన్ని మొదలుపెట్టారు. పాత్రలో లీనమైపోవడమే సహజమైన నటన అని నమ్మిన నానా పాటేకర్, నాటక రంగ వృత్తిలోకి ప్రవేశించడం యాదృచ్ఛికంగా జరిగింది. 1970లో ఒక మరాఠీ నాటక రిహార్సల్స్ జరుగుతుండగా స్నేహితుడిని కలవడానికి వెళ్లి, ఆ నాటక దర్శకుడి కోరిక మేరకు ఒక పాత్రలో నటించారు. రాష్ట్రస్థాయి పోటీలో ఉత్తమ నటుడి అవార్డు ఆయనను ప్రొఫెషనల్ నటుడిగా మార్చింది. పూణేలోని కళాశాల నాటక సంస్కృతితో మమేకమై ప్రయోగాత్మక నాటకాలలో రాణించారు. 'పురుషోత్తం కరందక్' అనేది ఒక ప్రసిద్ధ నాటక పోటీ కార్యక్రమం. ఇది ఆ తరానికి ఒక ప్రసిద్ధ శిక్షణా కేంద్రం. నానా పాటేకర్‌తో పాటు స్మితా పాటిల్, రోహిణి హట్టంగడి, సోనాలి కులకర్ణి, జబ్బర్ పటేల్, సతీశ్ అలేకర్, మోహన్ గోఖలే వంటి వారు తమ నటనకు మెరుగులు దిద్దుకున్నది ఇక్కడే. అక్కడ 'ఆవిష్కార్' నాటక సంస్థతో నానా అనుబంధం సాగింది. నానా పాటేకర్ రంగస్థల జీవితంలో జయవంత్ దళ్వీ 'పురుష్' నాటకం ప్రత్యేకమైనది. అవినీతిపరుడు, రాజకీయ అధికార మదంతో విర్రవీగే ప్రతినాయకుడిగా గులాబ్‌రావు భూమికను నానా పోషించారు. పాత్రలోని క్రూరత్వం, నవ్వులో వ్యంగ్యం, అహంకారాలను అత్యంత సహజమైన రీతిలో, అతిసాధారణ సంభాషణలతో ప్రదర్శిస్తారు నానా. 'పురుష్' నాటకాన్ని ఏకధాటిగా 16 సంవత్సరాల పాటు 1,860 ప్రదర్శనలు ఇవ్వడం భారతీయ నాటక చరిత్రలో ఒక మైలురాయి. 1979లో అనిల్ బార్వే 'హమీదాబాయిచీ కోఠీ' అనే నాటకం మరాఠీ నాటక రంగంలో ఒక సంచలనం. ఈ నాటకానికి విజయా మెహతా దర్శకత్వం వహించారు. ఇందులో నానా పాటేకర్ ఒక దళారి పాత్రను పోషించి, కపటత్వం, స్వార్థం, రంగులు మార్చే ఊసరవెల్లి లక్షణాలను తనదైన శైలిలో ఆవిష్కరించారు.దర్శకురాలిగా విజయా మెహతా నటులను తీర్చిదిద్దే నేర్పు నానా నటనా పరిణతికి ఎంతగానో దోహదపడింది. ఆమె దర్శకత్వంలోనే నానా పాటేకర్ 1979లో 'మహాసాగర్' నాటకాన్ని ప్రదర్శించారు. అది మరాఠీ నాటకరంగంలో మరో సంచలనం. విక్రమ్ గోఖలే, నీనా కులకర్ణి, భరతి ఆచ్రేకర్ తదితరులతో కలిసి ఆయన నటించిన ఈ నాటకం సుదీర్ఘకాలం ప్రదర్శితమైనవాటిలో ఒకటి. మెహతా నాటకాలు వాటిలో నాటకీయత కంటే నటులు, పాత్రల చుట్టూ కేంద్రీకృతమై ఉండేవి. ఈ విధానం నానా సహజ సామర్థ్యాలకు బాగా సరిపోయింది. నాటక సృజనలో 'నేను ఒక శిశువును సృష్టిస్తాను, ప్రేక్షకులు దానికి ప్రాణం పోస్తారు' అని విజయా మెహతా అంటారు. నానా పాటేకర్ పరిపూర్ణ నటుడిగా మారడానికి ఆమెమార్గదర్శనం తోడైంది. మహారాష్ట్రలో బలమైన సాహిత్య సంప్రదాయం, సామాజిక చైతన్యం, నాటక రచనకు ఉన్న ప్రాధాన్యం, ప్రయోగాత్మక రంగస్థల ధోరణులు అక్కడి నటులను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకున్న నానా 'ససా ఆణి కాసవ్', 'గౌరాయీ' వంటి నాటకాలు ప్రదర్శించారు.విజయ్ టెండూల్కర్ 'పాహిజే జాతీచే' అనే పదునైన వ్యంగ్య నాటకంలో నానా పాటేకర్ 'బాబ్యా' పాత్రను పోషించారు. కులం, అధికారం, ప్రేమ వంటి అంశాలను లోతుగా ఆవిష్కరించిన నాటకం ఇది. దీని ప్రదర్శన చూడటానికి వెళ్లిన సినీ దర్శకుడు జబ్బర్ పటేల్... యువ నానా పాటేకర్ హాస్యం, రాజకీయాలు, యవ్వనపు గందరగోళాలను ఎంతో సునాయాసంగా సమతుల్యం చేస్తున్న తీరుకు అబ్బురపడి తన సినిమాలో ఒక పాత్ర చేయమన్నాడు. అలా 1979లో పటేల్ తీసిన 'సింహా సన్'లో పాటేకర్ నటించారు. నాటకమే లోకంగా జీవిస్తున్న ఇతడిని సినిమా రంగంలోకి ప్రోత్సహించింది స్మితా పాటిల్. అంతకుముందే 'గమన్' చిత్రంలో నటించిన ఆయన... 'అంకుశ్' (1986), 'ప్రతిఘాత్' (1987), 'మోహ్రే' (1987), 'త్రిషాగ్ని' (1988), 'అవామ్' (1987) వంటి చిత్రాలలో నటించారు. మీరా నాయర్ చిత్రం 'సలామ్ బాంబే' (1988)లో ఆయనది గుర్తుండిపోయే పాత్ర. 1989లో వచ్చిన 'పరిందా' నానా కెరీర్‌లో గొప్ప మైలురాయి. 'క్రాంతివీర్', 'ప్రహార్', 'నట్‌సామ్రాట్', 'ప్రకాశ్ బాబా ఆమ్టే' వంటి సినిమాలు నానా నటనా ప్రతిభకు అద్దంపట్టాయి. మరాఠీ నాటకరంగం నుంచి ఎదిగి, అనంతర కాలంలో భారతీయ సినిమాకు ట్రెండ్ సెట్టర్‌గా నిలిచి, వెండితెరపై మనలను అలరించిన నానా పాటేకర్ మరణంతో దేశం ఓ గొప్ప నటుడిని కోల్పోయింది.

# యూత్ పెట్టే పరీక్షలో మోదీ పాసవుతారా?

హార్దిక్ పటేల్ ఎవరికైనా గుర్తున్నాడా? ఒక దశాబ్దం క్రితం వార్తా పత్రికల ఫ్రంట్ పేజీలలోను, టెలివిజన్ ప్రైమ్‌టైమ్ ప్రసారాలలోనూ అతడికి చాలా ప్రాధాన్యం లభించింది. 2015లో గుజరాత్‌లో పాటీదార్ సామాజికుల ఆందోళనకు పటేల్ నాయకత్వం వహించినప్పుడు అతడి వయసు 22 సంవత్సరాలే. హార్దిక్ ర్యాలీలు ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కుదిపివేశాయి. దానికి గడ్డు పరిస్థితులను సృష్టించాయి. అవి చివరకు 2016లో ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ నిష్క్రమణకు దారితీశాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీని సవాల్ చేసిన ఆ యువకుడు ఇప్పుడు మరో బీజేపీ ఎమ్మెల్యే! తిరుగుబాటు నుంచి పాలకపక్షం శ్రేణుల్లోకి హార్దిక్ ప్రస్థానం 'గుజరాత్ మోడల్ ఆఫ్ మేనేజింగ్ డిసెంట్' (భిన్నాభిప్రాయాలు, నిరసనలను అణచివేయడంలో గుజరాత్ విధానం)ను విశదం చేస్తుంది. ఒక ఉద్యమాన్ని రాజ్యాధికారంతో అణచివేసేందుకు మీరు ప్రయత్నించవచ్చు లేదా ఆ ఉద్యమ ప్రధాన నాయకులను అధికార రాజకీయ వ్యవస్థలో భాగస్వాములుగా చేసుకోవచ్చు. నిరసనకారుడు ఒక భాగస్వామిగా మారవచ్చు, ఆందోళనకారుడు అస్మదీయుడు కాగలడు. అయితే ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఇప్పుడు ఎదుర్కోవలసిన ప్రశ్న బలవంతపెట్టడం లేదా కలుపుకుపోవడం, లేక ఆ రెండు పద్ధతుల కలగలుపుతో గుజరాత్‌ను పాలించిన రీతిలో విశాల భారత్‌ను పరిపాలించడం సాధ్యమేనా?ఢిల్లీలో ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనకారులపై దమనకాండ ఆ సవాల్‌కు ఒక దృష్టాంతంగా నిలుస్తుంది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసనలను భగ్నం చేసేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తుగా సీజేపీ నిరసనకారులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రజలు నిరసన ప్రదేశానికి చేరకుండా అవరోధాలు కల్పించారు. వందలాది యువజనులను అదుపులోకి తీసుకుని తాత్కాలిక డిటెన్షన్ సెంటర్లకు తరలించారు. ఈ పరిణామాలను కవర్ చేస్తున్న జర్నలిస్టులు కూడా పోలీసు ప్రతాపాలకు గురయ్యారు. సాధారణంగా ద్వైధీభావంతో వ్యవహరించే సుప్రీంకోర్టు సైతం నిరసన తెలిపే స్వేచ్ఛ ఒక ప్రాథమిక హక్కు అని మరోసారి నొక్కి చెప్పిందంటే పోలీసులు వ్యవహరించిన తీరు ఎంత అప్రజాస్వామికంగా ఉన్నదో అర్థమవుతుంది.ప్రతిపక్షాల మరో అరాచక ఆందోళనను తాము ఎదుర్కొంటున్నట్టు మోదీ సర్కార్ విశ్వసించి ఉండవచ్చు. విపక్షాల నిరసనను పోలీసులతో అదుపుచేయవచ్చని, రాజకీయ దురుద్దేశాలతో ఆ నిరసనకు పూనుకున్నాయని కొట్టివేయవచ్చని కూడా పాలకులు భావించి ఉండవచ్చు. నిరసనల నిర్వాహకులను అరెస్ట్ చేయడం ద్వారా వాటి ప్రభావాన్ని నివారించవచ్చని వారు అనుకుని ఉండవచ్చు. అయితే ఆ అంచనా పూర్తిగా ప్రమాదకరమైన తప్పుడు ఆలోచనే. ఢిల్లీ పరిణామాలు ఈ విషయాన్నే ధ్రువపరుస్తున్నాయి.ఇది సీఏఏ (పౌరసత్వ చట్ట సవరణ) వ్యతిరేక ఆందోళన కాదు. ఆ సందర్భంలో నిరసనకారులను జాతి వ్యతిరేకులు అని అధికార వర్గాలు నిత్యం నిందించాయి. వారిలో ఒకరైన ఉమర్ ఖలీద్ 2020 నుంచి జైలులో ఉన్నాడు. ఇది మూడు కొత్త వ్యవసాయ చట్టాలపై ప్రజ్వరిల్లిన రైతుల ఉద్యమం కూడా కాదు. ఉద్యమించిన రైతులను ప్రభుత్వం తొలుత ప్రతిఘటించింది. వారిలో కొందరు ఖలిస్థానీలు అని కూడా ఆరోపించింది. అంతిమంగా నవంబర్ 2021లో ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకోవడం మోదీ సర్కార్‌కు అనివార్యమయింది. ఈ ఉదంతాలు అన్నీ ప్రజా ఉద్యమాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వ సంసిద్ధతను తెలియజేశాయి. ప్రస్తుత ఉద్యమం విసురుతున్న సవాల్ స్వభావాన్ని ప్రభుత్వం అర్థం చేసుకున్నదా లేదా అన్నది ఈ నాటి ఒక ముఖ్యమైన ప్రశ్న.ఎందుకంటే ఇది కాంగ్రెస్, రాహుల్‌గాంధీ లేదా కొన్ని ప్రాంతీయ రాజకీయ పక్షాలతో వ్యవహరించడమంత తేలికైన విషయం కాదు, బీజేపీకి ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఉన్నది. గత పదేళ్లుగా ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికలలో అప్రతిహతంగా గెలుస్తూ వస్తోంది. ఎన్నికలు వచ్చినప్పుడు సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ఉన్నా, లేకపోయినా తమ ప్రత్యర్థులతో సమర్థంగా పోటీ పడేందుకు అవసరమైన సమస్త వనరులు తమకు ఉన్నాయనే ధీమా బీజేపీ నాయకులకు ఉన్నది. అయితే ప్రస్తుత సవాల్ ఒక సంప్రదాయ రాజకీయ పక్షం నుంచి వచ్చింది కాదు. రాజకీయ నాయకుల తీరుతెన్నుల పట్ల ఏ మాత్రం సహనం లేని యువ భారతీయులు విసిరిన సవాల్ అది. సంప్రదాయ రాజకీయ ప్రత్యామ్నాయాలను కూడా వారు విశ్వసించరు.

# పులివెందులలో కాల్పులు..

వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల కోసం పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నేతలను ముందుగా లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో వివాదం మొదలైంది. పోలీసుల నిర్ణయంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్తలు ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది.పరిస్థితి చేయిదాటిపోతుండటంతో గుంపును చెదరగొట్టి, శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నెలకొన్న తీవ్రమైన రాజకీయ పోటీయే ఈ ఉద్రిక్తతలకు కారణమని తెలుస్తోంది. ఘటన అనంతరం పులివెందులలో భారీగా పోలీసులను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారు.

## ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు:

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు.నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

## జనసేన అభ్యర్థుల తొలి జాబితా వచ్చేసింది..

**వీరితో పాటు 12 మున్సిపాలిటీలకు ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను కూడా పార్టీ ప్రకటించింది.**

అమలాపురం: నల్ల శ్రీధర్ , చిలకలూరిపేట: తోట రాజేశ్వరి

గొల్లప్రోలు: కదారి తమ్మయ్య నాయుడు , నరసాపురం: కొత్తపల్లి శైలజ

నిడదవోలు: కల్లం జ్యోతి , పెదన: మట్టా శివపావని

పిఠాపురం: బీరా విజయ్ శేఖర్ , పుత్తూరు: డి. ఏలుమలై

సాలూరు: గొర్లె విజయకుమారి , సామర్లకోట: పిట్టా జానకీ రామారావు

తెనాలి: టి. వెంకటరమణారావు తిరువూరు: పి. మాధవి టీడీపీ, బీజేపీతో ఉన్న కూటమిలో సీట్ల పంపకాల ఒప్పందం ప్రకారం, జనసేన పార్టీ మొత్తం నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు (శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, విజయవాడ) మరియు 21 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలలో పోటీ చేయనుంది. ప్రస్తుతం ప్రకటించినవి తొలి విడత అభ్యర్థులు మాత్రమేనని, త్వరలోనే మిగిలిన స్థానాలకు కూడా పేర్లను వెల్లడిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

# ఎల్–నినో ఎఫెక్ట్.. జల వివాదాలపై తెలంగాణ కొత్త వ్యూహం!

ఎల్–నినో ప్రభావం నేపథ్యంలో తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాల వినియోగంపై ప్రభుత్వం కొత్త వ్యూహాన్ని అనుసరించేందుకు సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో జల వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకునే దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు, సాగునీటి ప్రాజెక్టులు, నీటి విడుదలకు సంబంధించిన అంశాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు ప్రణాళికలపై దృష్టి సారిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మధ్య సమావేశం జరిగే అవకాశంపై ఆసక్తి నెలకొంది. అయితే, ఈ భేటీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కృష్ణా, గోదావరి జలాల పంపిణీ, ప్రాజెక్టుల అనుమతులు, నీటి లెక్కల పారదర్శకత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఎల్–నినో నేపథ్యంలో తెలంగాణ జల విధానంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో చూడాలి. ఎల్–నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నదీ జలాల వినియోగంపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో సాగు, తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌తో దశాబ్దాలుగా కొనసాగుతున్న కృష్ణా, గోదావరి జలాల వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సమాచారం. రాష్ట్రానికి న్యాయబద్ధంగా దక్కాల్సిన నీటి వాటాలను సాధించుకోవడంతోపాటు, పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. ఈ క్రమంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యే అవకాశాలపై చర్చ సాగుతోంది. అయితే, భేటీకి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**సమన్వయమే కీలకం!** నదీ జలాల వాటాల విషయంలో వివాదాలు కొనసాగించడం కంటే చర్చల ద్వారా పరిష్కారాలను అన్వేషించడం ప్రయోజనకరమని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండు రాష్ట్రాల మధ్య తలెత్తిన వివాదాలు, వాటికి దారితీసిన కారణాలు, న్యాయపరమైన చిక్కులను సమీక్షిస్తూ కొత్త ప్రతిపాదనలపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. పరస్పర అవసరాలు, నీటి లభ్యత, ప్రాజెక్టుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని చర్చలు జరిపితే దీర్ఘకాలంగా కొనసాగుతున్న సమస్యలకు పరిష్కారం లభించే అవకాశముందని భావిస్తున్నారు.

### మొదట కృష్ణా.. తర్వాత గోదావరి!

కృష్ణా నదీ జలాల కేటాయింపులు, వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణ అంశాలను ముందుగా చర్చకు తీసుకురావాలని తెలంగాణ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం గోదావరి జలాల వినియోగం, నికర జలాల కేటాయింపులు, వరద జలాల ఆధారంగా చేపడుతున్న ప్రాజెక్టులపై చర్చించే అవకాశముంది. ఒక నదికి సంబంధించిన సమస్యలను మరో నదిలోని ప్రాజెక్టులతో ముడిపెట్టడం వల్ల చర్చలు మరింత జటిలమవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే ఒక్కో అంశాన్ని విడిగా పరిశీలించి, పరస్పర అంగీకారంతో పరిష్కార మార్గాలను అన్వేషించాలన్న దిశగా ఆలోచన సాగుతున్నట్లు సమాచారం.

### చంద్రబాబుతో రేవంత్ భేటీ?

జల వివాదాల పరిష్కారంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడితో సమావేశమయ్యేందుకు రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ అంశంపై తెలంగాణ సీఎం కార్యాలయ అధికారులు ఏపీ ప్రభుత్వానికి సమాచారం అందించినట్లు సమాచారం. అయితే, సమావేశం ఎప్పుడు జరుగుతుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. రెండు రాష్ట్రాల మధ్య చర్చలకు సానుకూల వాతావరణం ఏర్పడితే నీటి కేటాయింపులు, వినియోగం, ప్రాజెక్టులకు సంబంధించిన అభ్యంతరాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో కుదిరిన ఒప్పందాలు, అమల్లో ఉన్న చట్టపరమైన నిబంధనలు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న ప్రక్రియలను పరిగణనలోకి తీసుకుంటూనే పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంటుంది.

### ఎల్–నినో నేపథ్యంలో ముందస్తు కసరత్తు

ఎల్–నినో ప్రభావం వర్షపాతంపై చూపే ప్రభావం, భవిష్యత్తులో నీటి లభ్యతపై ఏర్పడే అనిశ్చితి ప్రభుత్వాల ముందున్న కీలక అంశాలు. వర్షాలు తగ్గి జలాశయాల్లోకి నీటి ప్రవాహాలు పరిమితమైతే సాగు, తాగునీటి అవసరాలను సమన్వయం చేయడం సవాలుగా మారవచ్చు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవడం, ప్రాజెక్టుల నిర్వహణలో సమన్వయం పెంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. అయితే, ఎల్–నినో ప్రభావం ఒక్కటే ప్రస్తుత చర్చలకు కారణమని చెప్పలేం. కృష్ణా, గోదావరి జలాల పంపిణీకి సంబంధించిన దీర్ఘకాలిక వివాదాలు, ప్రాజెక్టుల నిర్మాణం, నీటి వినియోగంపై రాష్ట్రాల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలు కూడా కీలకంగా ఉన్నాయి.

## శ్రీ జోగుళాంబా సమేత బాలబ్రహ్మేశ్వర స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున అలంపూర్ క్షేత్రంలో వెలసిన శ్రీ జోగుళాంబా సమేత బాలబ్రహ్మేశ్వర స్వామి, అమ్మవార్లకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పట్టువస్త్రాలను సమర్పించారు. శనివారం కలెక్టర్ అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. తొలుత బాలబ్రహ్మేశ్వర స్వామి వారికి అభిషేకం చేశారు.. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్ కు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం తో తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జోగులాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రతి ఏటా పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీని పాటిస్తూ, జోగుళాంబా సమేత శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించడం జరిగిందన్నారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.స్వామి, అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.కలెక్టర్ వెంట దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ బి.సుధాకర్ రెడ్డి, అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ఈ వో దీప్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బియ్యపు గింజ మీద మహిషాసుర మర్ధిని





**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 17 . (నంది పత్రిక ):** నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్ర కారుడు కళారత్న చింత లపల్లె కోటేష్ దసరా దేవి శరన్నవ రాత్రులు పురస్కరించుకొని బియ్యపు గింజపై దుర్గామాతను, మహిషాసురుని సూక్ష్మ చిత్రాలు మైక్రో బ్రష్ ద్వారా వేశారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ దేవి శరన్నవ రాత్రులలో అమ్మ వారిని తొమ్మిది రోజుల పాటు ఒక్కొక్క అవతారంతో అలంకరణ చేసి పూజిస్తారు. అందుకే దేవి నవరాత్రులు అని అంటారు. ఈ నవ రాత్రులలో అత్యంత పవిత్రమైన, శక్తి వంతమైన రోజు దుర్గాష్టమి. ఈ రోజున లోక కంటకుడైన మహిషాసురుని సంహారించడానికి అమ్మవారు దుర్గాదేవి రూపం దాల్చింది. అందుకే ఈ దుర్గాష్టమి రోజున దుర్గాదేవి రూపాన్ని, మహిషాసుర రూపాన్ని వేసాను. మహిషా అంటే దున్నపోతు.మహిషాసురుడు దున్నపోతు ఆకారంలో ఉంటాడు కాబట్టి దున్నపోతు ఆకారంలో చూపించాను. ఇలా రెండు సూక్ష్మ చిత్రాలు ఈ బియ్యపు గింజలో చూపించాను. భారతదేశంలో దసరా నవరాత్రులు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. హిందువులకు ముఖ్యమైన పెద్ద పండుగ. భక్తులందరికి దసరా పర్వదిన శుభాకాంక్షలు. అందరికి ఆ దుర్గామాత అనుగ్రహం ఉండాలని కోరుకుంటున్నాను. జై దుర్గామాత.. జై జై దుర్గామాత.

## ఎవరైతే బాగుంటారబ్బా!



**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 17:** త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాలలో రచ్చబండ రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. ఏ గ్రామాలకు ఏ అభ్యర్థి అయితే బాగుంటుందో అని గ్రామాలలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం రాజకీయ ఎన్నికల రంగంలోకి దిగాలంటే డబ్బుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి, నాయకులు ఎవరు పోటీలలో దిగేందుకు ఆసక్తి కనపరచడం లేదంటూ విశ్లేషకులు, పరిశీలకు లు చర్చించుకుంటున్నారు. పోటీలలో దిగి లక్షలు ఖర్చు చేసుకుంటున్నారే తప్ప, తర్వాత తమ రాజకీయ పరిస్థితి ఏమిటి అని కొందరు గ్రామస్థాయి నాయకులు చర్చించుకుంటున్నారు. కేవలం పంతాలు పట్టుదలకు పోయి ఖర్చు చేసుకోవడం తప్ప, ఈ పదవుల వల్ల పెద్దగా ఒనగూరింది ఏమీ లేదని పలువురు రచ్చబండల వద్ద మాట్లాడుకుంటున్నారు. పంతాలకు పోయి ఎన్నికలలో దిగి లక్షల రూపాయలు ఖర్చుపెట్టి, చివరకు చాలామంది రాజకీయ బికారులుగా మారిపోతున్నారని వ్యంగ్యంగా గ్రామాలలో చర్చించుకుంటున్నారు. చాలామంది గ్రామస్థాయి నాయకులు అధినేతల ఆదేశాలతో ఏదో మొక్కుబడిగా తమ పోటి చేస్తామని తమ జాబితాలను సమర్పించుకుంటున్నారు తప్ప, తమను ఎంపిక చేసింది లేదు, తాము గెలిచింది లేదు అంటూ పెదవి విరుస్తున్నారు.

## 18వ వార్డు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బోయ లక్ష్మీదేవి నామినేషన్

### కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు



**డోన్ నంది పత్రిక అక్టోబర్ 17** డోన్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు కౌన్సిలర్ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) అభ్యర్థిగా బోయ లక్ష్మీదేవి నామినేషన్ దాఖలు చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించారు. 18వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు బోయ లక్ష్మీదేవి ముందుకు రావడంతో వార్డు రాజకీయాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించి వార్డు అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ఆమె బరిలో నిలిచారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో డోన్ పట్టణంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. 18వ వార్డులో ఎన్నికల పోటీపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

## టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ గోవిందరాజులు నామినేషన్ దాఖలు

**నంది పత్రిక ఆత్మకూరు** ఆత్మకూరు: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రెండో రోజు ఆత్మకూరు టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ గోవిందరాజులు నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ.. తనకు చైర్మన్అభ్యర్థిగాఅవకాశం కల్పించిన శ్రీశైలంఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆత్మకూరు పట్టణ ప్రజలందరూ తనకు సహకరించి, ఆశీర్వదించిగెలిపించాలని కోరారు. ప్రజల మద్దతుతో చైర్మన్‌గా ఎన్నికైతే పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజాసేవకుఅంకితమవుతానని తెలిపారు. నామినేషన్ వేయుటకు డాక్టర్ గోవిందరాజులు వెంట సీనియర్అడ్వకేట్ గోవిందరెడ్డిటిడిపినాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## మెడికల్ సీట్ సాధించిన తెరిసా కళాశాల విద్యార్థిని షేక్ సఫియా



**నంది పత్రిక ఆత్మకూరు :** నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం ఆత్మకూరు పట్టణంలోని థెరిసా కళాశాల విద్యార్థినీ షేక్ సఫియా మెడికల్ సీట్ సాధించినట్లు ఎస్ వి గ్రూప్ అఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్ పర్సన్ బి జి వసుంధర మరియు థెరిస్సా కళాశాల డైరెక్టర్ సాయి ప్రణీత్ తెలిపారు. శనివారం వెలువడిన ఫైనల్ ఫేస్ లో కడప ఫాతిమా మెడికల్ కళాశాలలోసీటుసాధించినట్లుపేర్కొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణానికి చెందిన షేక్ చాంద్ బాషా, షేక్ మహబూనిస దంపతుల కుమార్తె షేక్ సఫియా మెడికల్ సీట్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. మా కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని మెడికల్ సీట్ సాధించడం పట్ల విద్యార్థినీ షేక్ సఫియా కృషి,పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల కృషి ఎంతగానోఉందన్నారు.మెడికల్ సీటు సాధించడం పట్ల తోటి విద్యార్థినీ,విద్యార్థులు, అధ్యాపకులు,తల్లిదండ్రులు, బంధుమిత్రులుఅభినందించారు.

## జలాదీవాసం వీడిన సంగమేశ్వరాలయం

### -సంగమేశ్వరంలో భక్తుల సందడి



**కొత్తపల్లి - నంది పత్రిక :** ప్రతి ఏటా 8 నెలలు జలాదీవాసంలో ఉండి కేవలం 4 నెలలు మాత్రమే భక్తులకు దర్శనమిచ్చే ప్రాచీన సంగమేశ్వరాలయం ఈ ఏడాది కేవలం రెండు నెలలు పూర్తిగా గడవక ముందె జలాదీవాసం వీడింది. శనివారం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 840 అడుగులకు చేరుకుంది. దీంతో సంగమేశ్వరాలయం పూర్తిగా కృష్ణాజలాల నుంచి బయటపడింది. కేవలం ఆలయ ప్రాంగణంలో, ఆలయ మంటపంలో మోకాలి లోతు నీళ్ళు మాత్రమే ఉన్నాయి. అయిన భక్తులు సంగమేశ్వర స్వామిని దర్శించుకొనేందుకు దసరా సెలవుల నేపథ్యం అధిక సంఖ్యలో వచ్చారు. మోకాలిలోతు నీళ్ళలోనే వెల్లి సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు సంగమేశ్వరాలయానికి చేరుకొని సందడి చేశారు.



## శ్రీశైలం ఎమ్మెల్యే ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన“బిజ్జం“



**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 17:** నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని కలిశారు. శనివారం ఆత్మకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉన్న బుడ్డాను బిజ్జం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బండి ఆత్మకూరు మండలం నుండి జడ్పిటిసి సభ్యుడిగా భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేస్తారని బిజ్జం సుబ్బారెడ్డి కొద్దిరోజుల క్రితమే ప్రకటించారు. ఈ నేపథ్యంలో బిజ్జం సుబ్బారెడ్డి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని కలవడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. జడ్పిటిసి ఎన్నికలలో ఆసక్తి కలిగిన నాయకులు తమ పేర్లను పంపుకోవాలని రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఒక సమావేశాన్ని నిర్వహించారు. బండి ఆత్మకూరు నారాయణపురం జిసి పాలెం ఏ కోడూరు భోజనం గ్రామాలలోని నాయకులు కొందరు జెడ్పిటిసి ఎన్నికలలో పోటీ చేసేందుకు ఆసక్తి కనపరుస్తూ తమ వివరాలను పార్టీ కార్యాలయంలో సమర్పించుకున్నారు. ఈ గ్రామాలకు సంబంధించిన నాయకుల పేర్ల జాబితా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గూటికి చేరిపోయింది. ఇలాంటి పరిస్థితులలో బిజ్జం సుబ్బారెడ్డి ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ ని కలిసి జడ్పిటిసి అభ్యర్థిగా తనకు కూటమి ప్రభుత్వం తరపున అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆత్మకూర్ మునిసిపల్ ఎన్నికలలో బిజీగా ఉన్నామని, ఈ ఎన్నికల తర్వాత జెడ్పిటిసి అభ్యర్థిని ఖరారు చేస్తామని, నీ పేరు కూడా మా పరిశీలనలో ఉందని బుడ్డా పేర్కొన్నట్లుగా తా జా సమాచారం. మొదటి నుండి బిజ్జం సుబ్బారెడ్డి తన పట్ల వినయ విధేయుడుగా ఉన్నట్లు బుడ్డా పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. అభ్యర్థి ఎంపిక విషయంలో అందరం కూర్చుని మాట్లాడుకొని ఒక నిర్ణయం తీసుకుందామని బిజ్జం తో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నట్లుగా తెలుస్తోంది.

# రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి

### పెయిడ్ న్యూస్‌పై నిరంతర పర్యవేక్షణ

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**నంది పత్రిక కర్నూలు బ్యూరో:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రాజకీయ ప్రకటనలను ప్రచారం చేసుకునే ముందు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటయిందని, ఇందులో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆదోని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, గూడూరు నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి జయమ్మ మెంబర్లుగా ఉంటారన్నారు. ఎన్నికల సమయంలో ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాల్స్, బల్క్ ఎస్ఎంఎస్‌లు తదితర మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను పర్యవేక్షించడంతో పాటు, పెయిడ్ న్యూస్‌పై కూడా ఎంసీఎంసీ కమిటీ నిఘా ఉంచుతుందని కలెక్టర్ తెలిపారు. టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఆడియో, వీడియో ప్రదర్శనలు, ఈ-పేపర్లు, బల్క్ ఎస్ ఎం ఎస్ లు, వాయిస్ మెసేజ్ లు తదితర మాధ్యమాల ద్వారా రాజకీయ ప్రకటనలు ప్రచారం చేయాలనుకునే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనల ప్రకారం ముందస్తు ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు.. ఎన్నికల సమయంలో ఒక అభ్యర్థికి లేదా రాజకీయ పార్టీకి అనుకూలంగా వార్తల రూపంలో ప్రచురించే పెయిడ్ న్యూస్‌ను గుర్తించి, సంబంధిత నిబంధనల ప్రకారం పర్యవేక్షించే బాధ్యతను కూడా ఎంసీఎంసీ నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. రాజకీయ ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ, సంబంధిత అనుమతులు, పెయిడ్ న్యూస్ పర్యవేక్షణకు సంబంధించిన వివరాల కోసం కర్నూలు కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెల్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు..కావున, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నిక నిబంధనలను పాటిస్తూ, రాజకీయ ప్రకటనల ప్రచారానికి అవసరమైన ముందస్తు ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు లేదా తమ రాజకీయ ప్రకటనను ప్రసారం చేయడానికి లేదా ప్రదర్శించడానికి నిర్ణయించిన తేదీకి కనీసం 3 రోజుల ముందుగా, నిర్దేశించిన ప్రొఫార్మా లో వీజవీజ కి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్“

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కర్నూలు వారి సూచనల మేరకు బి. లీలా వెంకట శేషాద్రి, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు వారు కర్నూలు కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు “లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్“ నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి “లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు మరియు పరిష్కారము మొదలగు అంశాలపై సూచనలు చేశారు.అలాగే పెండింగ్ లో గల కేసులలో ఎన్ని కేసులలో బెయిల్స్ మంజూరు చేశారో వాటి కేసుల యొక్క స్థితిగతులను తెలుసుకొని వాటిని ఏ విధంగా త్వరిత గతిన పరిష్కరించాలో అనే దానిపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామ చంద్ర రావు , అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఏ. సులోచన,సిబ్బంది పాల్గొన్నారు.



# జయహో శ్రీకృష్ణదేవరాయ!

## తెలుగు వైభవానికి పట్టాభిషేకం చేసిన మహాచక్రవర్తి

**బొల్లు రామమోహన్,**

**కడప అక్టోబర్ 17 (నంది పత్రిక రిపోర్టర్)** అక్టోబర్ 17 శ్రీకృష్ణదేవరా యల వర్ధంతిదేశభా షలందు తెలుగు లెస్స" అంటూ తెలుగు భాషా కీర్తిపతాకను దిక్కులన్నిటా ఎగురవేసిన మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలు. ఖడ్గంతో సామ్రాజ్యాన్ని విస్తరించి, కలంతో సాహిత్య సామ్రాజ్యాన్ని నిర్మించి, ప్రజారంజక పాలనతో చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహాచక్రవర్తి ఆయన. "రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా!" అన్న సామెతను గుర్తుచేసేలా ఆయన సంకల్పబలం, పరిపాలనా దక్షత విజయనగర సామ్రాజ్యాన్ని ఉచ్ఛస్థితికి చేర్చాయి.

**ఖడ్గానికి పదును.. కలానికి పరిమళం!** 1509లో విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించిన శ్రీకృష్ణదేవరాయలు 1529 వరకు పాలించారు. ఆయన పాలన విజయనగర చరిత్రలో స్వర్ణయుగంగా ప్రసిద్ధి చెందింది. యుద్ధరంగంలో వీరత్వం ప్రదర్శిస్తూనే, ప్రజా సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధికి, వాణిజ్య విస్తరణకు, కళాసాహిత్యాల వికాసానికి విశేష ప్రాధాన్యమిచ్చారు."పట్టుదల ఉంటే కొండనైనా పిండి చేయవచ్చు" అన్న నానుడికి ఆయన జీవితం నిదర్శనం. శత్రువుల సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, వ్యూహరచనతో విజయాలను సాధించి విజయనగర సామ్రాజ్య ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. అయితే ఆయన గొప్పతనం యుద్ధ విజయాలకే పరిమితం కాలేదు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు.

**అష్టదిగ్గజాలతో సాహితీ సామ్రాజ్యం!** రాజు కత్తి పట్టినప్పుడు రాజ్యం రక్షించబడుతుంది; కలానికి గౌరవం ఇచ్చినప్పుడు సంస్కృతి సుసంపన్నమవుతుంది. ఈ సత్యాన్ని ఆచరణలో చూపించిన సాహిత్యాభిమాని శ్రీకృష్ణదేవరాయలు. ఆయన ఆస్థానం తెలుగు సాహిత్యానికి మహోన్నత వేదికగా నిలిచింది. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు తదితర కవులతో అలరారిన అష్టదిగ్గజాల సాహితీ వైభవం తెలుగు ప్రజలకు గర్వకారణం.ఆయనే స్వయంగా రచించిన 'ఆముక్తమాల్యద' తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించింది. అందులో రాజధర్మం, ప్రజాపాలన, ఆర్థిక వ్యవస్థపై వ్యక్తమైన ఆలోచనలు ఆయన దూరదృష్టికి అద్దం పడతాయి. "విద్య లేనివాడు వింత పశువు" అన్న సామెతను గుర్తుచేస్తూ, విద్యావంతులను, కవులను, పండితులను గౌరవించిన పాలకుడిగా ఆయన నిలిచారు. ప్రతిభకు పట్టం కడితేనే సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని తన ఆస్థానం ద్వారా చాటిచెప్పారు.

**ప్రజలే రాజ్యానికి పునాది!** వ్యవసాయం దేశానికి వెన్నెముక అని గుర్తించిన రాయలు చెరువులు, కాలువలు, సాగునీటి సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. వ్యవసాయం వర్ధిల్లితేనే రైతు కుటుంబాలు బాగుపడతాయని, రైతు బాగుంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని ఆయన పాలనా దృక్పథం తెలియజేస్తుంది."నీరు ఉంటేనే పంట.. పంట ఉంటేనే సంపద" అన్నది వ్యవసాయ సమాజం నేర్పిన జీవన సత్యం. సాగునీరు, వాణిజ్యం, ఆర్థిక కార్యకలాపాలు అభివృద్ధి చెందడంతో విజయనగరం దేశవిదేశాల వ్యాపారులను ఆకర్షించిన మహానగరంగా ఎదిగింది. ముత్యాలు, రత్నాలు, ఇతర విలువైన వస్తువుల వ్యాపారంతో నగర సంపద, వైభవం విదేశీ యాత్రికుల వర్ణనల్లో ప్రతిఫలించాయి.పోర్చుగీసు సందర్శకులు డొమింగో పేస్, ఫెర్నావో న్యూనిజ్‌ల రచనలు ఆనాటి విజయనగర వైభవాన్ని తెలుసుకోవడానికి ముఖ్యమైన చారిత్రక ఆధారాలుగా నిలిచాయి.

**ధర్మానికి అండ.. ఆలయాలకు ఆదరణ!** శ్రీకృష్ణదేవరాయలు హిందూ ఆలయాలకు దానధర్మాలు చేసి, అనేక పుణ్యక్షేత్రాల అభివృద్ధికి తోడ్పడ్డారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిపై ఆయనకు విశేష భక్తి ఉన్నట్లు శాసనాధారాలు తెలియజేస్తున్నాయి. తన కాలంలో ఆలయాలు కేవలం ఆరాధనా కేంద్రాలే కాకుండా కళలు, శిల్పాలు, సంగీతం, సామాజిక జీవనానికి కూడా కేంద్రాలుగా విలసిల్లాయి.అయితే ఒక పాలకుడి గొప్పతనాన్ని మతపరమైన ఆదరణతో మాత్రమే కొలవలేం. ప్రజల పట్ల బాధ్యత, ఇతర సంప్రదాయాల పట్ల సహనం, న్యాయపాలన, సమాజాభివృద్ధి వంటి అంశాలు కూడా అంతే ముఖ్యం. "ధర్మో రక్షతి రక్షితః" అన్న సూక్తి సారాన్ని గుర్తుచేసేలా ధర్మబద్ధమైన పాలనకు ఆయన ప్రాధాన్యమిచ్చారు.

**రాజనీతి.. రణనీతి.. దూరదృష్టి!** శ్రీకృష్ణదేవరాయలు సైనిక వ్యూహాల్లో నిష్ణాతుడు. దక్కన్ ప్రాంతంలోని ప్రత్యర్థి రాజ్యాలతో జరిగిన పోరాటాల్లో విజయాలు సాధించి, విజయనగర సామ్రాజ్య సరిహద్దులను విస్తరించారు. బలమైన సైన్యం, సమర్థులైన సేనాధిపతులు, చాకచక్యమైన రాజనీతి ఆయన విజయాలకు దోహదపడ్డాయి. ఆయనకు ప్రధానమంత్రి తిమ్మరుసు కీలక సహాయకుడిగా నిలిచారు. రాయలు ఆయనను 'అప్పాజీ' అని పిలిచేవారని చారిత్రక సంప్రదాయం చెబుతుంది. అయితే రాజదర్బారులో జరిగిన కుట్రలు, కుటుంబ విషాదాలు ఆయన జీవితంలోని విషాద అధ్యాయాలుగా మిగిలాయి."అధికారం శాశ్వతం కాదు.. కీర్తి చిరస్థాయం" అన్న సత్యాన్ని ఆయన జీవితం మనకు గుర్తుచేస్తుంది. 1529లో ఆయన మరణించినప్పటికీ, ఆయన పాలన, సాహిత్యాభిమానం, విజయనగర వైభవం నేటికీ ప్రజల జ్ఞాపకాల్లో సజీవంగా ఉన్నాయి.

**నేటి పాలకులకు రాయల పాలన ఓ పాఠం!**

నేటి పాలకులు శ్రీకృష్ణదేవరాయల చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు ఎన్నో ఉన్నాయి. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయాన్ని బలోపేతం చేయడం, విద్యా సాహిత్యాలను ప్రోత్సహించడం, నీటి వనరులను కాపాడటం, వాణిజ్యాన్ని విస్తరించడం, ప్రతిభను గౌరవించడంఇవే సమర్థ పాలనకు పునాదులు. "మాటలు కోటలు దాటుతాయి.. చేతలు గడప దాటవు"అన్న సామెతను పాలకులు గుర్తుంచుకోవాలి. ప్రకటనలతో కాదు, ప్రజలకు అందే ఫలితాలతోనే పాలనకు విలువ చేకూరుతుంది.




చరిత్రను కీర్తించడం మాత్రమే కాదు, చరిత్రలోని మంచి లక్షణాలను వర్తమానంలో ఆచరించడం నిజమైన నివాళి.శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం అంటే ఒక చక్రవర్తిని కొనియాడటమే కాదుతెలుగు భాషా వైభవాన్ని గౌరవించడం, సాహిత్యాన్ని ఆదరించడం, రైతును కాపాడటం, ప్రజాసంక్షేమాన్ని పాలనకు ప్రథమ ప్రాధాన్యంగా నిలపడం.రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోవచ్చు.. కోటలు శిథిలాలుగా మారవచ్చు.. కానీ ప్రజల హృదయాల్లో నిలిచిన మహనీయుల కీర్తి ఎన్నటికీ చెరిగిపోదు!

జయహో తెలుగు తేజం!
జయహో సాహితీ సమ్రాట్!
జయహో శ్రీకృష్ణదేవరాయ!



## అన్నపూర్ణ దేవిగా అమ్మవారి దర్శనం



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 17 (నంది పత్రిక):** రుద్రవరం మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈరోజు అమ్మవారు భక్తులకు 'అన్నపూర్ణ దేవి' అలంకారంలో దర్శనమిచ్చారు. ఒక చేతిలో అన్నపాత్ర, మరో చేతిలో గరిటె పట్టుకుని సకల ప్రాణులకు ఆకలి తీర్చే కరుణామయిగా అన్నపూర్ణాదేవిని భక్తులు విశేషంగా ఆరాధిస్తారు. కాశీపురాధీశ్వరి అయిన ఈ చల్లని తల్లిని పూజిస్తే ఇళ్లలో అన్నపానాలకు, సిరిసంపదలకు ఎప్పటికీ లోటు ఉండదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వేదమంత్రోచ్ఛారణల మధ్య మహిళలు భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం కన్నులపండువగా మహా మంగళహారతి జరిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో పూజా దాతలతో పాటు ఆర్యవైశ్య సంఘం పెద్దలు, ఆర్యవైశ్య మహిళలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## కాలరాత్రి అలంకరణ లో శ్రీ చౌడేశ్వరి అమ్మవారు

**బనగానపల్లె అక్టోబర్ 17నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శరన్నవరాత్రి మహోత్సవములలో ఏడవ రోజు అమ్మవారు కాలరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు శనివారం ఉదయాన్నే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి ప్రాతః కాలాది విశేష పూజ,అష్టైశ్వర్య మహా మంగళ నిరాజనం తీర్థ ప్రసాద వినియోగం చేయడం జరిగింది. అదేవిధం గా సాయంత్రం ప్రకార రథోత్సవం నిర్వహించడం జరిగినది. భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ . శ్రీనివాస రెడ్డి , ఆలయ చైర్మన్ నాగార్జున రెడ్డి , ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్గా.ఎ. కుమార్ రెడ్డి పర్యవేక్షిన్నారు.



## బద్వేల్‌లో 23, 24వ వార్డుల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు..

### భారీ మెజార్టీతో గెలుస్తామని భూమిరెడ్డి ఓబుల్ రెడ్డి ధీమా



**బద్వేల్, అక్టోబర్ 17 (నంది పత్రిక )** వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ, 24వ వార్డులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కౌన్సిలర్ అభ్యర్థులుగా భూమిరెడ్డి విజయ, భూమిరెడ్డి ఓబుల్ రెడ్డి పురపాలక సంఘం కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా భూమిరెడ్డి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ.. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జగనన్న అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని పేర్కొన్నారు. గత 20 ఏళ్లలో జరగని అభివృద్ధి తమ ప్రభుత్వ హయాంలో బద్వేల్ మున్సిపాలిటీలో జరిగిందని ఆయన అన్నారు.బద్వేల్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలు ఉన్నారని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 23వ, 24వ వార్డుల ప్రజల ఆదరణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## డ్రైనేజీ సమస్యతో అవస్థలు.. అధికారుల నిర్లక్ష్యంపై మహబూబ్‌నగర్ దర్గా వీధి ప్రజల ఆవేదన!

**పోరుమామిళ్ల, అక్టోబర్ 17 (నంది పత్రిక):**వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని మహబూబ్‌నగర్ దర్గా వీధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధిలో మురుగునీరు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవడంతో గత ఐదారు సంవత్సరాలుగా సమస్య కొనసాగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని వీధి ప్రజలు వాపోతున్నారు. మురుగునీరు నిలిచి పోవడం వల్ల దుర్వాసన వ్యాపిస్తోందని, వీధుల్లో తిరగలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. అర్ధరాత్రి వేళ పాములు, తేళ్లు వస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నామని, అపరిశుభ్ర వాతావరణం కారణంగా మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఈ సమస్యను స్థానికులు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ, ఇన్ని సంవత్సరాలుగా సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమని అన్నారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి ఇప్పటికైనా స్పందించి వీధిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.



## నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..!

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు



**కడప బ్యూరో చీఫ్, అక్టోబర్ 17: నంది పత్రిక** వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ఆఅమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా డివిజన్ స్థాయి రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో గుంపులుగా చేరకుండా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల నిబంధనలు, నామినేషన్ కేంద్రాల వద్ద అమలు చేయాల్సిన ఆంక్షలపై ముందుగానే అవగాహన కల్పించాలని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంకు లక్ష విరాళం

**బనగానపల్లె అక్టోబర్ 17నందిపత్రిక** శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి కి నందవరం గ్రామ వాస్తవ్యులు కీ.శే.ఉలవపల్లె రామిరెడ్డి వారి ధర్మపత్ని కీ"శే" ఉలవపల్లె సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఉలవపల్లె ఓబుళ కొండారెడ్డి శనివారం ఆలయ అభివృద్ధి కొరకు 1,00,000/- రూ. (ఒక లక్ష రూపాయలు) చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు.



## స్థానిక ఎన్నికలలో వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలి

### విహెచ్‌పిఎస్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కె. అబ్దుల్ రరవూఫ్ విజ్ఞప్తి



**వెలుగోడు, అక్టోబర్ 17 (నంది పత్రిక):**రాబోయే స్థానిక సంస్థల, మున్సిపల్ కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ మరియు సర్పంచ్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేకంగా రెండవ క్యూ లైన్ ఏర్పాటు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కె. అబ్దుల్ రవూఫ్ ఎలక్షన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.శనివారం ఆయన వెలుగోడులో విలేకరులతో మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా వృద్ధులు, వికలాంగులు నేరుగా వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సాధారణ ఓటర్లతో పాటు గంటల తరబడి నిలబడటం వారికి ఎంతో శ్రమతో కూడుకున్న విషయమని, ప్రత్యేక క్యూ లైన్ ఉండటం వల్ల వారు ఉత్సాహంగా వచ్చి ఓటింగ్ లో పాల్గొంటారని తెలిపారు.ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గారితో పాటు జిల్లా, మండల ఎన్నికల అధికారులను ఆయన సమితి తరఫున కోరారు.

## నారాయణి దేవి అలంకారములో అమ్మవారు



**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 17 . (నంది పత్రిక ):**శ్రీమతి కశెట్టి సుబ్బమ్మ మరియు బాలాజీ మర్చంట్స్ కమిటీ కళ్యాణ మండప దేవస్థానం లో దసరా శరన్నవరాత్ర మహోత్సవములు ఏడవ రోజు శనివారం నారాయణి దేవి అలంకారము లో అమ్మవారు దర్శనమిచ్చారు.ఈ అలంకారానికి సహక రించిన వారు సాయి కృష్ణ జ్యువెలర్స్ ,ఆలయ అర్చకులు ఈశ్వర నిఖిలేష్ శర్మ అర్చకత్వంలో దసరా నవరాత్రుల సందర్భంగా మహా చండీయాగం అంగరంగ వైభవంగా నిర్వహించారు.కశెట్టి కృష్ణమూర్తి దేవస్థానం అధ్యక్షులు శ్రీమతి కశెట్టి సుబ్బమ్మ మరియు బాలాజీ మర్చంట్స్ కమిటీ కళ్యాణ మండప దేవస్థానం పాలకవర్గం మరియు కార్యవర్గ సభ్యులు పాల్గన్నారు.

# నెల 22వ తేదీలోగా స్మార్ట్ కిచెన్ల విస్తరణ పనులు పూర్తి చేయాలి..!



### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశం
### ఒక లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా సిద్ధం అవ్వాలి

**కడప, బ్యూరో చీఫ్ అక్టోబర్ 17 నంది పత్రిక:** జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు చేపట్టిన స్మార్ట్ కిచెన్ల విస్తరణకు సంబంధించి పెండింగ్‌బి పనులన్నింటినీ ఈ నెల 22వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో పాటు ఆయా మండలాల ఎంఈవోలతో వీసీ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో స్మార్ట్ కిచెన్ల నిర్వహణ, పాఠశాలల అనుసంధానం, ఆహార సరఫరా మార్గాలు, మౌలిక సదుపాయాలు, ఇతర పెండింగ్ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రతి విద్యార్థికి నిర్ణీత సమయానికి వేడివేడి ఆహారం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ లోపు జిల్లా వ్యాప్తంగా 38 స్మార్ట్ కిచెన్ల ద్వారా లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇంకా స్మార్ట్ కిచెన్ల పరిధిలోకి తీసుకురావాల్సిన 369 పాఠశాలలకు అనుసంధాన ప్రక్రియ, రవాణా మార్గాల గుర్తింపును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆహార సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న పాఠశాలలకు సంబంధించి రవాణా సమయాలను పునఃపరిశీలించి, సరఫరా సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. స్మార్ట్ కిచెన్లలో వాహనాల స్టాండింగ్ షెడ్లు, వాహనాల నిలుపుదల వేదికలు, రక్షణ కంచెల నిర్మాణం వంటి పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు, శుద్ధి చేసిన తాగునీటి వ్యవస్థలు, బోరుబావులు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వంటశాలల్లో ఏర్పాటు చేసిన బయో వ్యర్థాల శుద్ధి పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. వంటశాలలకు అవసరమైన కూరగాయలు, ఇతర వంట సరుకులను ముందస్తు ప్రణాళికతో సేకరించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీప కొనుగోలు కేంద్రాలను గుర్తించాలని సూచించారు. విద్యార్థుల నమోదు సంఖ్య తక్కువగా ఉన్న 13 ప్రాధాన్య ప్రాంతాల్లో వంటశాలల అవసరాలకు అనుగుణంగా కూరగాయల తోటలను ఏర్పాటు చేయాలన్నారు. మండలాల వారీగా ఖాళీలను పరిశీలించి అర్హులైన పాఠశాల వంట సహాయకులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విబిజీ రామ్ జీ, ఉద్యాన శాఖ, ఏపీఎంఐపి శాఖల సమన్వయంతో.. ఆయా పాఠశాలల పరిధిలో న్యూట్రీ కిచెన్ గార్డెన్స్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలన్నారు. జిల్లాలోని మొత్తం 38 స్మార్ట్ కిచెన్లలో ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, పరిసరాల శుభ్రత విషయంలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో శంషుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ, స్మార్ట్ కిచెన్ల నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసులు, ఏపీ సీఎస్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, పౌర సరఫరాలు, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కర్నూలు ఎంపీ నాగరాజును కలిసిన మేయర్ అభ్యర్థి ప్రత్యూష



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు మేయర్ పీఠం పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేస్తామని ఎంపీ బస్తిపాటి నాగరాజు ధీమా వ్యక్తం చేశారు.. కూటమి మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష ఎంపీ నాగరాజును ఎంపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు..ఈ సందర్భంగా మేయర్ ఎన్నికల్లో పార్టీ విజయం పై చర్చించారు..ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధిని నిరంతరంగా కొనసాగించేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# ప్రశాంతంగా కొనసాగుతున్న ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ...

### కర్నూలు, వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ కార్యాలయంలో మేయర్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలన
### ఎన్నికల నిబంధనలు పాటిస్తేనే ఎన్నికలు ప్రశాంతం.
### నామినేషన్ కేంద్రాల వద్ద కట్టిదిట్టమైన భద్రత.
### కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం కర్నూలు వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని స్వయంగా సందర్శించి పరిశీలించారు. అనంతరం కర్నూలు ఎస్పీ మీడియాతో మాట్లాడారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలతో పాటు, గూడూరు నగర పంచాయతీ పరిధిలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు అత్యంత ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందన్నారు. ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు సాగే ఈ ప్రక్రియలో అన్ని పార్టీల అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు లోబడి తమ పత్రాలను దాఖలు చేస్తున్నారన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిని నిర్దేశించి బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు .ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు అనుమతి ఉన్న పరిమిత వ్యక్తులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నామన్నారు. ఆదివారం కూడా ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. సోమవారం ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ నెల 28వ తేదీన పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ మొదలవడానికి ముందే అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎలక్షన్ కమిషన్ నిబంధనలన్నింటినీ స్పష్టంగా వివరించామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తప్పకుండా పాటిస్తే ఎన్నికలు శాంతియుతంగా జరుగుతాయన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా ముగిసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజలు జిల్లా పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎస్పీ తో పాటు సిఐలు మధుసుధన్ రావు, రామయ్య నాయుడు ఉన్నారు.



# నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత..!

### జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్
### పులివెందుల ఘటనలో పరిస్థితిని అదుపులోకి తెచ్చాం..




**పులివెందుల బ్యూరో చీఫ్, అక్టోబర్ 17: నంది పత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని, నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘించి గుంపులుగా వచ్చే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, డీఐజీ కోయ ప్రవీణ్ తో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. నామినేషన్ల రెండో రోజు శుభదినం కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చారని ఎస్పీ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో రద్దీ ఏర్పడినప్పటికీ, ఒకటి రెండు ఘటనలు మినహా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని పేర్కొన్నారు. కడప జిల్లాలో శుక్రవారం నుంచే భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఆంక్షలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ శనివారం కూడా ఆదేశాలు జారీ చేశారని, ఈ నిబంధనలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు ముందుగానే సమాచారం అందించామని వివరించారు. ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా కూడా నిబంధనలను తెలియజేశామని చెప్పారు. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించడంతో పాటు శాంతిభద్రతలను కాపాడటమే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు అభ్యర్థులు తమ వెంట పరిమిత సంఖ్యలో వ్యక్తులను మాత్రమే తీసుకురావాలని, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల పరిధిలో నిర్ణయించిన వాహన పరిమితులను పాటించాలని సూచించారు. గుంపులుగా చేరడం, ఊరేగింపులుగా రావడం నిబంధనలకు విరుద్ధమని, ఆంక్షలను తప్పనిసరిగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. పులివెందులలో సుమారు 500 మంది ఒకేచోట చేరి నామినేషన్ కేంద్రానికి వెళ్లేందుకు ప్రయత్నించారని ఎస్పీ తెలిపారు. వారిని గుంపులుగా వెళ్లవద్దని, అభ్యర్థులు మాత్రమే నిబంధనల ప్రకారం రావాలని పోలీసులు పలుమార్లు హెచ్చరించి, నచ్చజెప్పారని వివరించారు. అయినప్పటికీ కొందరు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగం చేపట్టామని తెలిపారు. రాళ్లదాడి కొనసాగడంతో కొన్ని రౌండ్లు గాలిలో కాల్పులు జరిపినట్లు వెల్లడించారు. అవసరమైన మేరకే బలప్రయోగం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఆదివారం కూడా సెక్షన్ 163 కింద ఆంక్షలు అమల్లో ఉంటాయని, నామినేషన్ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో గుమిగూడడం, ఊరేగింపులుగా రావడం అనుమతించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో స్వతంత్ర అభ్యర్థులతో పాటు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులందరికీ నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు పోలీసు శాఖ సహకరిస్తుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వరల్డ్ ట్రామా డే సందర్భంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మాక్ డ్రిల్




**కర్నూల్ సిటీ నందిపత్రిక** వరల్డ్ ట్రామా డే సందర్భంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించే విధానంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించి, ప్రాణాలను కాపాడేందుకు అనుసరించాల్సిన చర్యలను ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రమాద స్థలం నుంచి క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించే ప్రక్రియను ప్రదర్శించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో బాధితుల పరిస్థితి, గాయాల తీవ్రత తదితర వివరాలను ఆసుపత్రి సిబ్బందికి "ప్రీ అరైవల్ నోటిఫికేషన్" ( పాన్ ) అనే ఒక ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నంబర్ కు నోటిఫికేషన్ /కాల్ రూపంలో ముందుగానే తెలియజేస్తారు. దీంతో బాధితులు ఆసుపత్రికి చేరుకునేలోపు అవసరమైన వైద్య ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. అనంతరం అంబులెన్స్‌లో ఆసుపత్రికి చేరుకున్న బాధితులకు వైద్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితి మరియు గాయాల తీవ్రత ఆధారంగా రెడ్, ఎల్లో, గ్రీన్ రంగుల బ్యాండ్లను కేటాయించారు. రెడ్ బ్యాండ్‌ను తక్షణ ప్రాణరక్షక చికిత్స అవసరమైన బాధితులకు, ఎల్లో బ్యాండ్‌ను అత్యవసర వైద్య పర్యవేక్షణ అవసరమైన వారికి, గ్రీన్ బ్యాండ్‌ను స్వల్ప గాయాలున్న బాధితులకు కేటాయించే ట్రయాజ్ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ :– ప్రమాద సమయంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అంబులెన్స్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం, బాధితులకు ప్రాధాన్యత క్రమంలో చికిత్స అందించడం, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడం వంటి అంశాలను ఈ మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించామని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో సరైన వైద్య చికిత్స అందించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని, ఇలాంటి మాక్ డ్రిల్స్ వైద్య సిబ్బందిని అత్యవసర పరిస్థితులకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తో పాటు ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారులు మరియు ఎమర్జెన్సీ విభాగపు వైద్యులు డాక్టర్ శారదా, డాక్టర్ సుబ్రహ్మణ్యం , సీఎంఓ లు మరియు ఇతర ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీకి షాక్.. వైఎస్సార్‌సీపీలోకి సీనియర్ నేత వడ్డే రవితో పాటు 10 కుటుంబాలు



**కర్నూలు సిటీ నందిపత్రిక** పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ 45వ వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, దివంగత వడ్డే నాగమునయ్య కుమారుడు వడ్డే రవి మరియు స్వాములు , అంజి బిల్డర్ తో పాటు మొత్తం 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి , వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్సీపీ సిద్ధాంతాలు, ప్రజల పట్ల పార్టీ నిబద్ధతపై విశ్వాసంతో పార్టీలో చేరిన కార్యకర్తలకు ఆయన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మిడుతూరు శ్రీనివాసులు , సాపూరి వీరయ్య , కాశన్న , హనుమంతయ్య , సుభాన్ , కుమ్మరి వెంకటేశ్వర్లు , నవీన్ రెడ్డి , ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# 34వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి చింతలపల్లి రామకృష్ణకు కర్నూలు నగర బలిజ సంఘం మద్దతు

### కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రామకృష్ణకు సంఘం నాయకుల అభినందనలు

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 34వ వార్డు (కృష్ణా నగర్) నుంచి కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి, కూటమి తరఫున భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా బరిలో నిలిచిన చింతలపల్లి రామకృష్ణ కి కర్నూలు నగర బలిజ సంఘం నాయకులు అభినందనలు తెలియజేసి, తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. శనివారం ఉదయం కర్నూలు నగరంలోని కృష్ణా నగర్‌లో ఉన్న చింతలపల్లి రామకృష్ణ స్వగృహంలో జరిగిన ఈ సమావేశంలో బలిజ సంఘం ప్రముఖులు పాల్గొని, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయనకు తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చింతలపల్లి రామకృష్ణ మృదుస్వభావి, స్నేహశీలి, విద్యావేత్తగా, సామాజిక సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా సమాజంలో మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. బలిజ సంఘీయుల అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా బలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో విశేషంగా కృషి చేయడంతో పాటు, బలిజ ఉద్యోగులకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి తోడ్పడిన వ్యక్తిగా రామకృష్ణకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. సమాజంలోని వివిధ వర్గాలతో సత్సంబంధాలు కలిగి ఉండి, ప్రజల సమస్యల పట్ల అవగాహనతో వ్యవహరించే ఆయనకు ప్రజాసేవ చేసే అవకాశం లభిస్తే వార్డు అభివృద్ధికి మరింత కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చింతలపల్లి రామకృష్ణకు తమ సంఘీభావాన్ని ప్రకటిస్తూ, ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో కర్నూలు నగర బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి మండ్లెం రవి కుమార్, కోశాధికారి, రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, బలిజ సంఘం నాయకులు, రిటైర్డ్ పంచాయతీరాజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కామిని వెంకటేశ్వర్లు, పోస్టల్ యూనియన్ నాయకులు వై. మధుసూధన రావు,తదితరులు పాల్గొన్నారు.



# దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం.. ఐదుగురి పరిస్థితి విషమం

హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ (వీూ=) ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం–2026' టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది. వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ (ాఅస్త్రష్ట్రఅఅస్త్ర ఎతీబంం) ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది.

# నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు...!

## రాయలసీమ డీఐజీ కోయ ప్రవీణ్

## రేపు (ఆదివారం) చివరి రోజు.. అన్ని ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు పెంపు



**కడప, బ్యూరో చీఫ్ అక్టోబర్ 17: నంది పత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా నాలుగు జిల్లాల పరిధిలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టామని డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. శనివారం సాయంత్రం పులివెందులలోని ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక. శ్రీధర్ చెరుకూరి తో కలిసి రాయలసీమ డిఐజి కోయా ప్రవీణ్ పత్రికల సమావేశంలో మాట్లాడారు. ఆయనతో పాటు జూలై ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హాజరయ్యారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లో ఎన్నికల ప్రక్రియను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, నంద్యాల జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు, వైఎస్సార్ కడప జిల్లాలో ఒక నగరపాలక సంస్థతో పాటు ఎనిమిది మున్సిపాలిటీలు, అనంతపురం జిల్లాలో ఒక మున్సిపాలిటీలో ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. నామినేషన్ల మొదటి రోజు కర్నూలులో చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తమైందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగిందని, అనంతపురం జిల్లాలోనూ పరిస్థితి ప్రశాంతంగా ఉందని వివరించారు. రాయచోటిలో నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన ఒక అభ్యర్థి అనుమతి లేని తుపాకీ కలిగిన ప్రైవేటు భద్రతా సిబ్బందితో వచ్చినట్లు గుర్తించామని, దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పులివెందులలోనూ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా పులివెందులలో ఎలాంటి హింసాత్మక ఘటనలు, ఆస్తి నష్టం లేదా ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.నామినేషన్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 కింద ఆంక్షలు అమలు చేస్తున్నామని డీఐజీ వివరించారు. నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులు, వారి వెంట వచ్చే వ్యక్తులు నిబంధనలు పాటించాలని, పెద్ద సంఖ్యలో గుంపులుగా చేరడం, ఊరేగింపులు నిర్వహించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. నాలుగు జిల్లాల్లోనూ నామినేషన్ కేంద్రాల వద్ద పరిమిత సంఖ్యలోనే అభ్యర్థులు, అనుమతి ఉన్న వ్యక్తులు వచ్చేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లో ఆదివారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో అదనపు అప్రమత్తతతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు ప్రశాంతంగా నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు పోలీసు బందోబస్తు కల్పిస్తామని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని డీఐజీ కోయ ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు.

# 33వ వార్డులో జనసేన అభ్యర్థి కె. పావనికి మద్దతుగా రాయలసీమ సంఘాలు,ప్రజాసంఘాలు ఏకమవ్వాలిభారీ మెజారిటీతో గెలిపించాలి

## రాయలసీమ రవికుమార్.

## రాష్ట్ర అధ్యక్షులు,ఆర్విపిఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** బీసీ సమాజానికి చెందిన కె. పావనిని గెలిపించాలని, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నేతలు,ప్రజా పరిరక్షణ సమితి నేతలు పిలుపు. 33వ వార్డు కార్పొరేటర్‌గా జనసేన పార్టీ అభ్యర్థి కె. పావని నామినేషన్ దాఖలు చేశారు. బీసీ సమాజం నుంచి పోటీ చేస్తున్న కె. పావనికి ప్రజలు అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాయలసీమ రవికుమార్, ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె. బలరాం న్యాయవాది, ఈశ్వరయ్య, రామకృష్ణ తదితరులు పిలుపునిచ్చారు. రవీంద్ర టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్య కోడలైన కె. పావని మంచి మనసున్న వ్యక్తిగా, నీతి నిజాయితీలకు ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థిగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్నారని వారు పేర్కొన్నారు. సుబ్బయ్య గారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు, సమాజం పట్ల ఆయనకు ఉన్న బాధ్యతాభావం అభినందనీయమని తెలిపారు.ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు వచ్చిన సోదర కె.పావని కి అభినందనలు.33వ వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వం అవసరమని వారు అన్నారు. వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి సమస్యలు వంటి ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.బీసీ సమాజానికి చెందిన కె. పావని మామ రవీంద్ర టాలెంట్ స్కూల్స్ అధినేత సాయి సుబ్బయ్య అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడే మనిషని కావున ప్రజలు తమ మద్దతు కె. పావనికి తెలియజేసి, ప్రజాసేవకు అవకాశం కల్పించాలని కోరారు.33వ వార్డు అభివృద్ధి కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె. రవికుమార్, ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాయవాది కె. బలరాం , ఈశ్వరయ్య,రమణ, కృష్ణకాంత్ ,రామకృష్ణ, వీరేష్ తదితరులు పాల్గొని కె. పావనికి తమ మద్దతు ప్రకటించారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..!





## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ షెల్కే

## నచికేత్ విశ్వనాథ్ లతో కలిసి ప్రెస్ మీట్

## శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ ప్రాధాన్యం

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత

**పులివెందుల బ్యూరో చీఫ్, అక్టోబర్ 17: నంది పత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ గుంపులుగా వచ్చే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలిపారు.శనివారం పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడారు. పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నామినేషన్ల స్వీకరణ సందర్భంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఆంక్షలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్దకు పెద్ద సంఖ్యలో గుంపులుగా రావడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం అనుమతించబోమని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాలకు నిర్ణీత సంఖ్యలో మాత్రమే వెళ్లాలని, కేంద్రాల పరిసరాల్లో 500 మీటర్ల పరిధికి సంబంధించి అమల్లో ఉన్న ఆంక్షలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. శనివారం కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలను ఉల్లంఘిస్తూ పెద్ద సంఖ్యలో వ్యక్తులు ఒకేసారి నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులపై దాడి జరిగినప్పటికీ, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలుకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉందని, అభ్యర్థులు ఆందోళన చెందకుండా నిర్ణీత సమయంలో తమ నామినేషన్లు సమర్పించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఒకేసారి వచ్చే పరిస్థితి ఉంటే ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని, తద్వారా తగిన భద్రతా ఏర్పాట్లు చేసి నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లాలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారెవరినీ ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పులివెందుల మున్సిపాలిటీలో ఇప్పటికే 28 వార్డులకు నామినేషన్లు దాఖలయ్యాయని, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి ఒక నామినేషన్ వచ్చినట్లు తెలిపారు. శనివారం కూడా సుమారు 40 నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశం కల్పించడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా కలెక్టర్, డీఐజీ, ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



## అభివృద్ధిని చూసి టీడీపీలో చేరుతున్న నాయకులు మంత్రి టీజీ భరత్

**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సమక్షంలో వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. 15వ వార్డుకు చెందిన రాజ్‌ధార్ ఖాన్ సూరి, జిలానీ, 14వ వార్డుకు చెందిన షబీర్ టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో తాము చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. అయితే పార్టీలోకి మంచి వ్యక్తులను గుర్తించి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. నాయకులు పార్టీలో చేరడం సంతోషంగా ఉందని, మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 62వ వార్డుకు చెందిన రవి కుమార్, శివ కుమార్ లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.



# చేతివృత్తుల కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ‘విరాసత్‘



**నంద్యాల అక్టోబర్ 17 నందిపత్రిక :-** విరాసత్ పథకం భారతావని అద్భుతమైన కళలకు, అపురూపమైన చేతివృత్తులకు పుట్టినిల్లు. మగ్గంపై అల్లిన చీరైనా, చెక్కపై చెక్కిన శిల్పమైనా, మట్టితో చేసిన కుండైనా, లోహంతో తీర్చిదిద్దిన ఆకృతి అయినా.. అవన్నీ కేవలం వస్తువులు కావు; అవి మన దేశ సంస్కృతీ సంప్రదాయాలకు సజీవ సాక్ష్యాలు. తరతరాలుగా ఎన్నో కుటుంబాలు ఈ ప్రాచీన వృత్తులనే నమ్ముకుని జీవిస్తున్నాయి. అయితే, మారుతున్న కాలంతో పాటు పెట్టుబడి లేకపోవడం, పాత పరికరాలతోనే పనిచేయాల్సి రావడం, సరైన ప్రోత్సాహం కరువవడం వంటి కారణాలతో ఎంతోమంది కళాకారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనుమరుగవుతున్న ఈ విలువైన కళలను కాపాడుకుం టూనే, ఆ కళాకారుల కుటుంబాలకు అండగా నిలవాలన్న సదుద్దేశంతో భారత ప్రభుత్వం, జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఆర్థిక సంస్థ (చీవీణఖీజ) ఆధ్వర్యంలో ‘విరాసత్‘ అనే ఒక అద్భుతమైన పథకానికి శ్రీకారం చుట్టింది. ‘విరాసత్‘ అంటే వారసత్వం అని అర్థం. పేరుకు తగ్గట్టుగానే మన దేశపు గొప్ప కళా వారసత్వాన్ని కాపాడుతూ, చేతివృత్తుల వారికి ఒక బంగారు భవిష్యత్తును అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు వంటి ఆరు మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేద కళాకారులకు ఈ పథకం ఒక వరం లాంటిది. తమ పూర్వీకుల నుండి వస్తున్న సాంప్రదాయ వృత్తులనే నమ్ముకుని, ఆర్థికంగా ఎదగలేకపోతున్న నిజమైన కళాకారులకు ఈ చొరవ ద్వారా అండదండలు అందుతాయి.రూపాయలు 10 లక్షల వరకు ఆర్థిక భరోసా ఈ పథకం కింద అర్హులైన చేతివృత్తి కళాకారులకు రూ. 10 లక్షల వరకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తారు. ఈ డబ్బుతో వారు తమకు అవసరమైన ముడిసరుకు కొనుగోలు చేయవచ్చు, ఆధునిక యంత్రాలు, పనిముట్లు తెచ్చుకోవచ్చు. తమ వర్క్‌షాప్‌లను మరింతగా అభివృద్ధి చేసుకుని, నేటి మార్కెట్ పోటీని తట్టుకునేలా అత్యుత్తమ నాణ్యతతో వస్తువులను తయారు చేయడానికి ఈ పెట్టుబడి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరిగి అప్పుల పాలయ్యే దుస్థితి నుండి కళాకారులకు ఇది విముక్తి కల్పిస్తుంది. ఒత్తిడి లేని చెల్లింపు విధానంచిన్న వ్యాపారులు అప్పు తీసుకోవాలంటేనే భయపడేది వాయిదాల కోసమే. ఈ భయాన్ని పారద్రోలుతూ, ‘విరాసత్‘ పథకంలో చాలా సులభమైన చెల్లింపు విధానాన్ని ప్రవేశపెట్టారు. రుణం తీసుకున్న మొదటి ఆరు నెలల వరకు (మారటోరియం) వాయిదాలు కట్టాల్సిన అవసరం లేదు. ఈ ఆరు నెలల్లో వారు తమ వ్యాపారాన్ని చక్కగా ఏర్పాటు చేసుకుని, ఆదాయం పొందడం మొదలుపెట్టవచ్చు. ఆ తర్వాత, ఐదేళ్ల వ్యవధిలో చాలా సులభమైన వాయిదాల్లో ఈ రుణాన్ని తీర్చవచ్చు. వడ్డీ రేటు కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల కళాకారులపై ఎలాంటి ఆర్థిక భారం పడదు. మహిళా సాధికారతకు పెద్దపీటఎంబ్రాయిడరీ, అల్లికలు, బట్టలు కుట్టడం, హస్తకళలు వంటి రంగాల్లో మన దేశంలో వేలాది మంది మహిళలు అద్భుతాలు సృష్టిస్తున్నారు. కానీ పురుషులతో పోలిస్తే వీరికి ఆర్థిక సహాయం అందడం తక్కువే. ఈ అసమానతను తొలగించి, మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి ఎన్ఎమ్‌డిఎఫ్‌సి మహిళలకు వడ్డీలో అదనంగా ఒక శాతం రాయితీని అందిస్తోంది. దీనిద్వారా మహిళలు మరింత సులభంగా రుణాలు పొంది, ఆర్థికంగా స్థిరపడటమే కాకుండా తమ కుటుంబాలను కూడా ఉన్నత స్థితికి చేర్చగలుగుతారు. కళాకారులకు అధికారికంగా బ్యాంకుల ద్వారా లేదా సంస్థల ద్వారా రుణాలు ఇప్పించడం ద్వారా, వారు అసంఘటిత రంగంలో పడుతున్న కష్టాలకు ఈ పథకం చెక్ పెడుతోంది. ఆధునికత పేరుతో ప్రాచీన వృత్తులను దూరం చేసుకోకుండా, ఆధునిక సాంకేతికతను ఆ ప్రాచీన కళలకే జోడించి లాభాలు గడించేలా ఈ పథకం ప్రోత్సహిస్తోంది. ఇలాంటి చొరవల వల్ల మరుగున పడిపోతున్న ఎన్నో అద్భుతమైన కళలకు జీవం పోసినట్లవుతుంది. కళాకారులు ఆర్థికంగా ఎదిగితే, వారు తమతో పాటు తమ చుట్టుపక్కల ఉన్న యువతకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించగలుగుతారు. విరాసత్ పథకం కేవలం ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాదు.. అది మన నేల సంస్కృతిని కాపాడుకునే ఒక బృహత్తర యజ్ఞం. అందరినీ కలుపుకుని పోతూ (సమ్మిళిత అభివృద్ధి), అట్టడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రయాణంలో.. కళాకారుల చేతుల్లో ఉట్టిపడే నైపుణ్యానికి తగిన గౌరవం, వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతోంది. నిస్సందేహంగా, రేపటి తరాలకు మన కళా వారసత్వాన్ని సగర్వంగా అందించడంలో ఈ ‘విరాసత్‘ చెరగని ముద్ర వేస్తుంది

# రెండో రోజు నామినేషన్ల జోరు

**రెండో రోజు మేయర్‌కు 5, కార్పొరేటర్ స్థానాలకు 172 నామినేషన్లు**

**రెండు రోజుల్లో మేయర్‌కు 7, కార్పొరేటర్ స్థానాలకు 185 నామినేషన్లు**

**మేయర్ అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిమితి రూ.25 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థికి రూ.10 లక్షలు**

**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల్లో భాగంగా రెండో రోజు మేయర్, కార్పొరేటర్ స్థానాలకు మొత్తం 177 నామినేషన్లు దాఖలయ్యాయని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఒక్కరోజే మేయర్ పదవికి 5, కార్పొరేటర్ స్థానాలకు 172 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. దీంతో రెండు రోజుల్లో కలిపి మేయర్ పదవికి 7, కార్పొరేటర్ స్థానాలకు 185 నామినేషన్లు నమోదయ్యాయని, అన్ని స్థానాలకు కలిపి మొత్తం 192 నామినేషన్లు దాఖలైనట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు, ప్రతిపాదకుల పేర్లు 28-09-2026న ప్రచురించిన తుది ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని చల్లా ఓబులేసు సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, మేయర్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు గరిష్ఠంగా రూ.25 లక్షలు, కార్పొరేటర్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులు గరిష్ఠంగా రూ.10 లక్షలు మాత్రమే ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేయాలని సూచించారు. అభ్యర్థులు తమ రోజువారీ ఎన్నికల వ్యయ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, వ్యయ పర్యవేక్షణ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు.

# శ్రీ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో కన్నులపండుగా శరణ్నవ రాత్రి ఉత్సవాలు.

**బేతంచెర్ల అక్టోబర్ 17 ( నంది పత్రిక ).**బేతంచెర్ల మండలం, ఆర్ఎస్ రంగాపురం గ్రామ పొలిమేరలలో వెలసి ఉన్న ప్రముఖ వైష్ణవ దివ్యక్షేత్రం శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో శరణ్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు "శ్రీ సరస్వతీ దేవి" భక్తులకు దివ్యదర్శనమిచ్చారు.

**విశేష పూజా కార్యక్రమాలు అగు** శాస్త్రోక్త పూజలు: అమ్మవారికి చతుస్థానార్చన, మూలమూర్తికి విశేష తిరుమంజనం, అర్చనారాధనలు మరియు వేద పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హోమాలు మరియు సేవలు: మూలమంత్ర, శ్రీ సూక్త హవనాలు, లలితా సహస్రనామ కుంకుమార్చన మరియు కంటికి ఇంపుగా సహస్ర దీపాలంకరణ సేవ ఘనంగా జరిగాయి. గ్రామోత్సవం: పట్టువస్త్రాలు, విలువైన ఆభరణాలు, రంగురంగుల పుష్పాలతో విశేషంగా అలంకరించిన ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై వేంచేపు చేసి ఆలయ ప్రాంగణంలో వైభవంగా ఊరేగించారు.ఈ కార్యక్రమాలన్నీ దేవస్థాన డిప్యూటీ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ వి.ఎల్ల నాగయ్య పర్యవేక్షణలో వైభవంగా సాగాయి. ఈ వేడుకల్లో ధర్మకర్తల మండలి సభ్యులు, వేదపండితులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని,అమ్మవారి కృపా కటాక్షాలు పొందారు.



# కౌంటింగ్ కేంద్రం వద్ద యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

**రాకపోకలకు ప్రత్యేక మార్గాలు, వాహనాల పార్కింగ్,**

**బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట చర్యలు**

**ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు**

**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం నగర శివారులోని ద అథెనా స్కూల్‌లో చేపడుతున్న ఏర్పాట్ల పనులను చల్లా ఓబులేసు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, సిబ్బంది, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే సిబ్బంది, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిస్టర్ ఇడ్లీ హోటల్ వైపు నుంచి కౌంటింగ్ కేంద్రానికి వచ్చి, అథెనా స్కూల్ నుంచి బాలాజీ విల్లాస్ మీదుగా తిరుగు ప్రయాణం సాగేలా మార్గాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన అనుబంధ రహదారి నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం సమీపంలో ప్రత్యేక స్థలాలను గుర్తించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కిటికీలు మూసివేయడం, షార్ట్ సర్క్యూట్ కాకుండా విద్యుత్ సరఫరా నిలిపివేత, బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే ప్రదేశాలను గుర్తించడం, అవసరమైన సంఖ్యా గుర్తింపులు, రేడియం స్టిక్కర్ల ఏర్పాటు వంటి పనులు చురుగ్గా జరుగుతున్నట్లు వెల్లడించారు. పోలింగ్ రోజున అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల పత్రాలు, ఇతర సామగ్రిని సకాలంలో పంపిణీ చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చల్లా ఓబులేసు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్దన్, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



## కర్నూలు జిల్లా ఎన్నికల కమిటీ (డి ఈ సి ) ఛైర్మన్‌గా అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ నియామకం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు, రాజకీయ వ్యవహారాల కమిటీ (పి ఏసీ ) నిర్ణయం ప్రకారం, కర్నూలు జిల్లా ఎన్నికల కమిటీ (డి ఈ సి ) ఛైర్మన్‌గా నియమితులైనందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికను పారదర్శకంగా, సమన్వయంతో చేపట్టి, పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను అని, నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తాను అని అన్నారు.

## శ్రీశైలం దేవస్థానంలో అంగరంగ వైభవంగాదసరా మహోత్సవాలు





**శ్రీశైలం అక్టోబరు17(నంది పత్రిక)** దసరా మహోత్సవాలలో భాగంగా ఏడవరోజైన (17.10.2026) ఉదయం అమ్మవారికి ప్రాత:కాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపించబడ్డాయి. అదేవిధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్ర పారాయణలు జరిపించబడ్డాయి. అదేవిధంగా ఈ సాయంకాలం జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీ హోమం జరిపించబడుతాయి. రాత్రి 9.00గంటల నుండి కాళరాత్రిపూజ, అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీపూజలు జరుగనున్నాయి. కుమారీ పూజదసరామహోత్సవాలలో భాగంగా ప్రతీరోజు కుమారీ పూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ కుమారీపూజలో రెండుసంవత్సరాల నుంచి పదిసంవత్సరాల వయస్సు ఉన్న బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం జరుగుతోంది. కుమారిపూజ నవరాత్రి ఉత్సవాలలో ఒక ముఖ్యమైన సంప్రదాయం

**కాళరాత్రి అలంకారం** ఈ నవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారాలలో భాగంగా శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని కాళరాత్రి స్వరూపంలో అలంకరింపజేయడం జరుగుతుంది. నవదుర్గ స్వరూపాలలో ఏడవరూపం ఈ కాళరాత్రి. ఈ దేవి నల్లటి దేహఛాయతో జుట్టు విరియబోసుకొని పెదబొబ్బ నవ్వులతో, రౌద్రరూపములో ఉంటుంది. ఈ దేవి చతుర్భుజాలను కలిగి ఉండి, కుడివైపున అభయహస్తం, వరదముద్రను, ఎడమవైపు ఖడ్గము, లోహకంటకాన్ని ధరించి ఉంటుంది. కాళరాత్రి స్వరూపం చూడటానికి రౌద్రంగా ఉన్నప్పటికీ ఈమె ఎల్లప్పుడూ శుభ ఫలితాలనే ఇస్తుంది. అందుకే ఈమెను శుభంకరి అని కూడా పిలుస్తారు. దసరా మహోత్సవాలలో ఏడవనాడు కాళరాత్రిదేవిని పూజించాలని చెప్పబడింది. కాళరాత్రి దేవి దుష్టశక్తులను నాశనం చేస్తుంది. ఈ దేవిని కేవలం స్మరించనంత మాత్రమే భూత, ప్రేత, పిశాచాదులు భయపడి పారిపోతాయని, ఈ దేవిని ఆరాధించడం వలన భయాలనేవేవీ ఉండవని, సర్వదా సాధకుడు భయదూరుడవుతాడని భక్తుల విశ్వాసం.

**గజవాహనసేవ** ఈ ఉత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా (17.10.2026) గజవాహనసేవ జరిపించబడుతుంది. ఈ వాహనసేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి, గజవాహనంపై వేంచేపు చేయించి పూజాదికాలు చేయబడుతాయి.

## స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ



**కర్నూలు సిటీ నందిపత్రిక** పుట్టపర్తి నియోజకవర్గం స్థానిక సంస్థల ఎన్నికల సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు, కూటమి పార్టీ ఆదేశాల ప్రకారం పుట్టపర్తి నియోజకవర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి , పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, కుడా ఛైర్మన్ సోమిసెట్టి వెంకటేశ్వర్లు ,పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకులు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ పాల్గొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని పుట్టపర్తి, నియోజకవర్గంకు సంబంధించిన సమీక్ష జరిగింది. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కలిసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల జాబితాలను పరిశీలించారు ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ఆశావహులు, ప్రజలను కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయించినా, మిగిలిన ఆశావహులందరూ కూటమి పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ, ఐకమత్యంతో సహకరించి కూటమి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మనస్ఫూర్తిగా కోరడం జరిగింది.

## అట్టహాసంగా సీపీఐ అభ్యర్థి చింతల రామాంజలి నామినేషన్





**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని 21వ వార్డు కార్పొరేటర్గా సీపీఐ అభ్యర్థి చింతల రామాంజలి నామినేషన్ వేశారు. శనివారం ఉదయం బుధవారపేట నుండి స్వర్ణ చాణిక్యపురి కాలనీ వరకు ప్రజానాట్యమండలి డప్పు కళాకారుల డప్పు చప్పుళ్ళ మధ్య బారీ ర్యాలీగా వెళ్ళి సచివాలయంలో నామినేషన్ పత్రాలు ఆర్డీఓ కు అందచేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున పార్టీ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు జగన్నాధం, మనోహర్ మాణిక్యం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు , నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి చంద్రశేఖర్, కె శ్రీనివాసులు, నగర సహాయ కార్యదర్శులు సీ మహేష్, నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు,బీసన్న, భద్రకుమార్, సురేష్, కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఈశ్వర్ , రామాంజనేయులు, క్రిష్ణారెడ్డి, రాముడు, అన్వర్ బాషా , అశోక్, డప్పుమాణిక్యం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రంగస్వామి అయ్యప్ప నగర అధ్యక్షులు నాగరాజు నగరనాయకులు చంటి, రవి, తదితరులు పాల్గొన్నారు.

# డోన్ మున్సిపల్ ఛైర్మన్ పీఠంపై హోరాహోరీ పోరు!

**ఛైర్మన్ అభ్యర్థులుగా తనూజ రెడ్డి, చాటకొండ సునీత నామినేషన్లు**

**రెండో రోజు జోరుగా నామినేషన్ల ప్రక్రియ.. 20 వార్డులకు 29 నామినేషన్లు దాఖలు డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు**



**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 17:** డోన్ మున్సిపల్ సాధారణ ఎన్నికల సందడి పట్టణంలో రోజురోజుకూ పెరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజైన శనివారం అభ్యర్థులు ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు వివిధ వార్డుల నుంచి పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు నామినేషన్ల సమర్పణకు తరలిరావడంతో మున్సిపల్ కార్యాలయ పరిసరాలు సందడిగా మారాయి. పట్టణంలో ఎన్నికల వాతావరణం నెలకొనగా, రాజకీయ వర్గాల్లోనూ చర్చలు ఊపందుకున్నాయి. మొత్తం 20 వార్డులకు సంబంధించి శనివారం ఒక్కరోజే 29 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు.

**ఛైర్మన్ అభ్యర్థులుగా తనూజ రెడ్డి, చాటకొండ సునీత**

డోన్ మున్సిపల్ ఎన్నికల్లో కీలకంగా భావిస్తున్న ఛైర్మన్ పదవికి తనూజ రెడ్డి, చాటకొండ సునీత నామినేషన్లు దాఖలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వీరిద్దరూ బరిలోకి దిగడంతో మున్సిపల్ ఛైర్మన్ పీఠం కోసం పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. ఛైర్మన్ పదవిని దక్కించుకునే దిశగా ప్రధాన రాజకీయ వర్గాలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. రానున్న రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ మరింత ఉత్కంఠభరితంగా సాగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**20 వార్డుల్లో కొనసాగుతున్న నామినేషన్ల సందడి**

మున్సిపాలిటీలోని 20 వార్డులకు సంబంధించి అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. రెండో రోజు 29 నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థుల అనుచరులు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలుపై ప్రత్యేక దృష్టి సారించారు.

**డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు**

నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్ పర్యవేక్షణలో మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు, వారి అనుచరుల రాకపోకలను పర్యవేక్షిస్తూ ఎన్నికల నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకున్నారు. నామినేషన్ల సమర్పణకు వచ్చిన అభ్యర్థులు, వారి అనుచరులతో మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. పోలీసుల పర్యవేక్షణలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది.

**ఉత్కంఠగా మారుతున్న మున్సిపల్ ఎన్నికలు**

రెండో రోజే గణనీయమైన సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడం, ఛైర్మన్ అభ్యర్థులుగా తనూజ రెడ్డి, చాటకొండ సునీత నామినేషన్లు సమర్పించడం డోన్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసేలోపు మరెంతమంది అభ్యర్థులు బరిలోకి దిగుతారన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. రానున్న రోజుల్లో అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలు, ఎన్నికల ప్రచార వ్యూహాలతో డోన్ మున్సిపల్ ఎన్నికలు మరింత రసవత్తరంగా మారనున్నాయి.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఎన్నికల ప్రక్రియను దృష్టిలో ఉంచుకొని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ కర్నూలు నగరంలో శనివారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా నగరంలోని ముజఫర్ నగర్, షరీన్ నగర్, గురు రాఘవేంద్ర నగర్ తదితర ప్రాంతాల్లోని కార్పొరేటర్ల పోలింగ్ నామినేషన్ కేంద్రాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వీకర్ సెక్షన్ కాలనీలో ఉన్న అత్యంత సమస్యాత్మక (హైపర్ సెన్సిటివ్) పోలింగ్ కేంద్రాలైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఈ రెండు కేంద్రాల్లో అత్యధిక ఓటర్లు కలిగిన కేంద్రాలు కావడంతో అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడి బూత్‌ల వివరాలు, ఓటర్ల సంఖ్య తదితర అంశాలను సీఐ విక్రమసింహా ని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా స్థానిక మున్సిపల్ అధికారుల సమన్వయంతో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కర్నూలు ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు, కర్నూలు నాల్గవ పట్టణ సిఐ విక్రమ సింహా ఉన్నారు.



## కల్లూరు అర్బన్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ కల్లూరు అర్బన్ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. 38వ డివిజన్ కార్పొరేటర్ గా మాజీ కార్పొరేటర్ సంఘాల సుదర్శన్ రెడ్డి వైఎస్ఆర్సిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎద్దుల శివారెడ్డి సహకారంతో వై ప్రవల్లిక నామినేషన్ వేశారు. 33 వ డివిజన్ కార్పొరేటర్ గా వైయస్సార్సీపి మహిళా విభాగం నాయకురాలు మాజీ కార్పొరేటర్ గాజుల శ్వేతా రెడ్డి, 34వ డివిజన్ కార్పొరేటర్ గా వైసిపి పాణ్యం పబ్లిసిటీ విభాగం అధ్యక్షులు ఎం సాయి కృష్ణ, 35వ డివిజన్ కార్పొరేటర్ గా ఆదినారాయణమ్మ, 45 వ డివిజన్ కార్పొరేటర్ గా జె సుమశ్రీ, 48 వ డివిజన్ కార్పొరేటర్ గా గంగులు, 27వ డివిజన్ కార్పొరేటర్ గా బెల్లం మహేశ్వర్ రెడ్డి, 24వ డివిజన్ కార్పొరేటర్ గా నల్లబోతుల మమత నామినేషన్లు వేశారు కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సిరివెళ్ల మండలంలో వైసిపికి భారీ షాక్





## కామినేనిపల్లె మాజీ సర్పంచ్ తో పాటు 100 కుటుంబాలు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి సమక్షంలో టిడిపిలో కి చేరిక.

**శిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండలం కామినేనిపల్లె గ్రామంలో నరసింహారెడ్డి గారి నాయకత్వంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉంది. ఈ చేరికలకు ప్రధాన కారణం భూమా కుటుంబంపై వారికి ఉన్న నమ్మకం, మన కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై వారికి కలిగిన విశ్వాసం అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు...నరసింహారెడ్డి గారి ద్వారా రాబోయే రోజుల్లో శిరివెళ్ల మండలంలో మరింతమంది నాయకులు, కార్యకర్తలు మన పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలకు ఇంకా మంచి చేయాలనే ఉద్దేశంతో మన పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరినీ రాజకీయ నాయకులుగా కాకుండా మా కుటుంబ సభ్యులుగా ఆహ్వానిస్తున్నాం.మా దగ్గర పాతవారు, కొత్తవారు అనే తేడా లేదు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం ఉంటుంది. అందరినీ సమన్వయం చేసుకుంటూ, కలుపుకొని ముందుకు వెళ్తాం.

**నామినేషన్ల విషయంలో ఎవరికీ భయం అవసరం లేదు**

ఇప్పుడు వైసీపీ నాయకులు నామినేషన్లు వేయనివ్వడం లేదని, తమను భయపెడుతున్నారని ఆరోపణలు చేస్తున్నారు. కానీ ఆళ్లగడ్డలో నిన్న, ఈరోజు వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంది. ఆ హక్కును గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు కూడా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరగాలని స్పష్టం చేశారు. ఎవరూ భయపడకుండా నామినేషన్లు వేయాలి. ఎన్నికల్లో పోటీ చేయాలి. ప్రజల్లోకి వెళ్లాలి. ప్రజల తీర్పును గౌరవించాలి. వైసీపీ నాయకులకు కూడా నేను ఒకటే చెబుతున్నాను. మీరు నామినేషన్లు వేయండి. స్వేచ్ఛగా ప్రజల్లోకి వెళ్లండి. ప్రజల ముందు మీ పాలన గురించి చెప్పండి. మేము చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మేము ప్రజలకు వివరిస్తాం. చివరకు ఎవరు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారో ప్రజలే నిర్ణయిస్తారు.

**అభివృద్ధే మా బలం.. ప్రజలే మా నమ్మకం**

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నాం. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో చెరువులను నింపేందుకు కృషి చేశాం అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు..ప్రజలకు అవసరమైన పనులు చేయడం మా బాధ్యత. అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నాం. అందుకే ఈరోజు ఇతర పార్టీల నుంచి కూడా నాయకులు, కార్యకర్తలు మన పార్టీలోకి వస్తున్నారు.ఒక గ్రామంలో ఎన్నికల్లో మాకు తక్కువ ఓట్లు వచ్చినా, అక్కడి ప్రజలను కానీ, కార్యకర్తలను కానీ మేము దూరం పెట్టం. ప్రజలు మనకు ఓట్లు వేసినా, వేయకపోయినా అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలి. అదే మా విధానం.

**గంగుల కుటుంబానికి నా ప్రశ్న** ఈరోజు ఆళ్లగడ్డలో వరుసగా జరుగుతున్న చేరికలను చూసి వైసీపీ నాయకులు ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఎందుకు నాయకులు, కార్యకర్తలు తమ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నారు? ప్రజలు తమపై నమ్మకం కోల్పోవడానికి కారణాలేమిటి? తమను నమ్ముకున్న కార్యకర్తలకు ఏం చేశామో ఆత్మపరిశీలన చేసుకోవాలి. గంగుల ప్రభాకర్ రెడ్డి గారు నామినేషన్ల విషయంలో టీడీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ వ్యాఖ్యలను నేను ఖండిస్తున్నాను. ఎన్నికల్లో ఎవరైనా స్వేచ్ఛగా పోటీ చేయవచ్చు. ఎవరి నామినేషన్లకూ అడ్డంకులు ఉండకూడదు. ఆరోపణలు చేయడం కంటే వాస్తవాల ఆధారంగా మాట్లాడటం మంచిది అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు....గతంలో ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలను కూడా ప్రజలు మర్చిపోలేదు. అందుకే ఇప్పుడు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని మేము కోరుకుంటున్నాం.గంగుల విజయేంద్రరెడ్డి గారు కూడా మా పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా నామినేషన్లు వేయాలని సవాళ్లు విసురుతున్నారు. మా నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్యనే ఉన్నారు. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజల కోసం పోరాడాం. ఇప్పుడు అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. మాకు సమాధానం చెప్పేది మా పని, ప్రజల తీర్పు.

**సేవ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ మా ఆహ్వానం**

మేము పార్టీలోకి ఎవరినీ కేవలం సంఖ్య పెంచుకోవడానికి ఆహ్వానించడం లేదు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉన్నవారిని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలనుకునేవారిని, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చేవారిని గౌరవంగా ఆహ్వానిస్తున్నాం.ఈరోజు నరసింహారెడ్డి గారు భూమా కుటుంబంపై నమ్మకంతో మన పార్టీలోకి రావడం ఆ విశ్వాసానికి నిదర్శనం. ఆయనతో పాటు వచ్చిన ప్రతి ఒక్కరికీ మా పూర్తి సహకారం ఉంటుంది అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డలో ప్రతిరోజూ ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి రావడం మా బాధ్యతను మరింత పెంచుతోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అభివృద్ధిని కొనసాగిస్తూ ముందుకు వెళ్తాం అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

## 39 వ డివిజన్ కార్పొరేటర్ వైయస్సార్సిపి అభ్యర్థిగా కుమ్మరి చిట్టిబాబు



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ 39 వ డివిజన్ వైయస్సార్సీపీ అభ్యర్థిగా కుమ్మరి చిట్టిబాబు నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ సంఘాల సుదర్శన్ రెడ్డి ఆశీస్సులతో కార్పొరేటర్ గా పోటీ చేస్తున్నానని తెలిపారు. తనను గెలిపిస్తే వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంఘాల సుదర్శన్ రెడ్డి శాలివాహన సంఘం నాయకులు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కార్పొరేషన్ మేయర్ మరియు కార్పొరేటర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థకు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయు ఆశావాహులు రెండవ రోజు పార్టీ కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించుకుంటున్నారు. మేయర్ అభ్యర్థులుగా ఆరుమంది, కార్పొరేటర్ అభ్యర్థులుగా 44 మంది కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయుటకు దరఖాస్తులు చేసుకోవడమయినది.

## 33 వ డివిజన్ కు నామినేషన్ వేసిన విద్యావేత్త కుమ్మరి పావని



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ పరిధిలోని 33 వ డివిజన్ కార్పొరేటర్ గా కూటమి పార్టీల మద్దతుతో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విద్యావేత్త పి వి బి సుబ్బయ్య జనసేన జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు ఆశీస్సులతో జనసేన పార్టీ అభ్యర్థి గా విద్యావేత్త కుమ్మరి పావని (ఎమ్మెస్సీ బీఈడీ) నామినేషన్ దాఖలు చేశామని తెలిపారు. ప్రముఖ విద్యా సంస్థ రవీంద్ర విద్యానికేతన్ కరస్పాండెంట్ పీవీబీ సుబ్బయ్య కోడలు విద్యావేత్త కుమ్మరి పావని మాట్లాడుతూ ఎన్నికలలో గాజు గ్లాస్ గుర్తుపై ఓట్లు వేసి వేయించి గెలిపించాలని వార్డు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వార్డులో స్థానికంగా నివాసం ఉంటున్న తమ కుటుంబం పై నమ్మకం ఉంచి గెలిపిస్తే మౌలిక సదుపాయాలు కల్పించుటకు చేస్తామన్నారు. విద్యావేత్త శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పిబివి సుబ్బయ్య మాట్లాడుతూ కూటమి పార్టీల మద్దతుతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## 41 డివిజన్ కార్పొరేటర్ గా టిడిపి అభ్యర్థి పూల శివశంకర్ నామినేషన్



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు కార్పొరేషన్ పరిధి 41వ వార్డు డివిజన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి భారీ జన సందోహంతో బోయ పూల శివశంకర్ ర్యాలీగా బయలుదేరారు. పందిపాడు, అశ్విత్తాపురం, ఫరూక్ నగర్, శివప్ప నగర్, మాదిరాజు నగర్, అయ్యప్ప నగర్, తిరుమలగిరి వివిధ ప్రాంతాల నుండి 41 వ వార్డు నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కర్నూలు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ దేవేంద్ర రెడ్డి, ఆంజనేయులు, టిడిపి యువ నాయకులు శేఖర్ చౌదరితోపాటు నాయకులు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ డిపోను ఆకస్మిక తనిఖీ చేసిన ఏపీఎస్ఆర్టీసీ ఎండి కోనశివప్రసాద్





**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 17 నంది పత్రిక** ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోను, బస్టాండును శనివారం ఏపీఎస్ఆర్టీసీ ఎం డి కోన శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన డిపో అధికారులు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ అభివృద్ధిలో కార్మికులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. డ్రైవర్లు బస్సులను బాగా నడిపి మంచి కేఎంపిఎల్ తీసుకొని రావాలన్నారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం పాటుపడే కార్మికులకు సంస్థ చేయూత అందిస్తుందని అన్నారు. సిబ్బందికి రావలసిన ఇంక్రిమెంట్లు సకాలంలో అందించేందుకు డిపో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బస్టాండును కూడా ఆయన తనిఖీ చేసి బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. బస్ స్టేషన్ లో బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎండి శివప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా, డిపో మేనేజర్ సుబ్రమణ్యం, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు

## 38వ డివిజన్ కార్పొరేటర్ వైయస్సార్సిపి అభ్యర్థిగా జి ప్రవల్లిక

**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ 38 వ డివిజన్ వైయస్సార్సీపీ అభ్యర్థిగా జి ప్రవల్లిక నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ప్రవల్లిక మాట్లాడుతూ వైయస్సార్సీపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ సంఘాల సుదర్శన్ రెడ్డి ఆశీస్సులతో వైయస్సార్సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు వై శివారెడ్డి సహకారంతో కార్పొరేటర్ గా పోటీ చేస్తున్నానని తెలిపారు. తనను గెలిపిస్తే వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంఘాల సుదర్శన్ రెడ్డి, భూపాల్ రెడ్డి తదితర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆళ్లగడ్డలో అభివృద్ధి చేసి చూపించాం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 17, నంది పత్రిక** ఆళ్లగడ్డలో అభివృద్ధి చేసి చూపించామని, అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో దిగుతున్నామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ వేసిన తెలుగుదేశం పార్టీ ఛైర్మెన్ అభ్యర్థిని బలపరిచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టిడిపి అభ్యర్థులు, కూటమి నాయకులు ఎంతో ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో మేమంతా ఎన్నికల బరిలోకి దిగుతున్నామన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకొని చెరువులను నింపడం నుంచి, రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. ఆళ్లగడ్డలో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ఎన్నికల సంఘం, అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పార్టీలు ఎన్నికల నియమాలను గౌరవిస్తూ సహకరించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులంతా ఐక్యంగా ముందుకు సాగుతున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, సిపి వాసు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీలలితా దేవిగా దర్శనం ఇచ్చిన శ్రీ కాళికా మాత



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 17, నంది పత్రిక** ఆళ్లగడ్డ విశ్వరూప పారిశ్రామిక నగర్ లో వెలసిన శ్రీశ్రీశ్రీ కాళికామాత దేవస్థానము నందు అమ్మవారు శ్రీలలితాదేవి అలంకారంలో కొలువు తీరారు. అర్చకులు చంద్రశేఖర్ ఆచార్యులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, శ్రీ లలితాదేవిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం చేరివచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అల్పాహారం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు యద్దనపూడి శ్రీనివాసాచార్యులు, ఉపాధ్యక్షులు ముత్తలూరు సురేష్ ఆచార్యులు, కమిటీ సభ్యులు, యువజన కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



**మహానంది అక్టోబర్ 17 (నంది పత్రిక):–** మహానంది క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 7వ రోజు ఉత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం అలంకార మండపంలో కొలువైన అమ్మవారి ముందర తెలంగాణ రాష్ట్రం, భానుకోట జిల్లాకు చెందిన తాండవ కృష్ణ నృత్యాలయంకు చెందిన చిన్నారులు భక్తిశ్రద్ధలతో నృత్య నీరాజనం సమర్పించారు. బాలబాలికలు తమ అద్భుత అభినయంతో, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో అమ్మవారికి నృత్యార్చన చేశారు. చిన్నారుల మువ్వల సవ్వడులు, భక్తి భావనలు మహానంది క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించాయి. చిన్నారుల ప్రతిభను ఈవో శ్రీనివాస్ రెడ్డి,ఆలయ అధికారులు వారి గురువులను అభినందించారు.





Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# “సర్వ శుభంకరి“ శ్రీ కాళరాత్రి మాత




## మహానందిలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు...

**మహానంది అక్టోబర్ 17 (నంది పత్రిక):–** ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది ఆలయంలో శ్రీ కామేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 7వ రోజైన శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం శ్రీ కామేశ్వరి అమ్మవారి మూలమూర్తి భక్తులకు ‘శ్రీ మహా సరస్వతి’ రూపంలో దర్శనమిచ్చారు. అనంతరం సాయంత్రం వ్యాఘ్ర వాహనంపై ‘శ్రీ కాళరాత్రి దుర్గ’ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి ఏడో స్వరూపమైన కాళరాత్రి దేవి స్వరూపం భయంకరంగా ఉన్నప్పటికీ భక్తుల పాలిత సర్వశుభంకరి అని వేదపండితులు రవిశంకర్ అవధాని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ దుష్టశక్తులను సంహరించి, భక్తులను కష్టాల నుంచి రక్షించే శక్తిమంతమైన రూపంగా అమ్మవారిని ఆరాధిస్తారన్నారు. కాళరాత్రి దేవిని మనస్ఫూర్తిగా పూజించడం వల్ల భయాలు తొలగి, ధైర్యం, మనశ్శాంతి లభిస్తాయని భక్తులు నమ్ముతారు. అమ్మవారిని ‘శుభంకరి’ అని కూడా పిలుస్తారన్నారు. ఆమె రూపం భయంకరంగా కనిపించినప్పటికీ, భక్తులకు శుభాలను ప్రసాదించే తల్లిగా కొలుస్తారన్నారు. ముందుగా ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ల ప్రత్యేకాధికార పర్యవేక్షణలో యాగశాలలో వేదపండితులు రవిశంకర్ అవధాని బృందం, రుత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజల దాతలతో కలిసి నవదుర్గ కలశ అర్చనలు, శతచండీయాగము, శ్రీచక్ర నవావరణార్చనలను భక్తిశ్రద్ధలతో జరిపారు. సాయంత్రం వేళ అలంకార మండపంలో అమ్మవారికి కనుల పండుగగా సహస్ర దీపాలంకరణ సేవ, అష్టవిధ మహా మంగళహారతులు, సామూహిక కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. అనంతరం తెలంగాణ జిల్లా తాండవ కృష్ణ నృత్యాలయముకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన నాట్య నివేదన కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి వేళ వ్యాఘ్ర వాహనంపై ‘శ్రీ కాళరాత్రి దుర్గ’గా కొలువైన అమ్మవారికి వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పూజలు అనంతరం, మంగళ వాయిద్యాలు, మేళతాళాలు మరియు అశేష జనవాహిని నడుమ గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, ఏఈఓ మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్యలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.







# శ్రీ మహా లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు..



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 17 నంది పత్రిక**ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి మూలా నక్షత్రం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ మూర్తిని శ్రీ మహాలక్ష్మిగా అలంకరించి అలంకార మండపంలో కొలువు తీర్చి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉభయ దారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అలంకారాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, నిచ్చెన మెట్ల రామయ్య బైసాని రవి తదితర సభ్యులు పాల్గొన్నారు.

**భక్తులను ఆకట్టుకున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి చలనచిత్రం**

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతినిత్యం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం వారు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి చలనచిత్రాన్ని అమ్మవారి శాల ఆవరణలో ప్రదర్శన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి చలనచిత్రాన్ని తిలకించి జై! వాసవాంబ అంటూ నినాదాలు చేశారు.



## ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో విజయ డంకా మోగిస్తాం

### మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేశీద్రారెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 17 నంది పత్రిక** ;మున్సిపాలిటీ ఎన్నికల సంబంధించి 32 వార్డులు చైర్మన్ స్థానానికి వైకాపా అభ్యర్థులు బరిలో ఉంటారని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి వెల్లడించారు. ఆయన శనివారం ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ల సందర్భంగా శుక్రవారం ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకొని అధికారులు తమకు సమయం కేటాయించగా వారి సూచన మేరకు శనివారం నామినేషన్లు దాఖలు చేశామన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో వైకాపా విజయకేతనం ఎగురవేస్తుందని బీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నామినేషన్లు వేయడం తొలి అడుగుగా భావిస్తున్నామన్నారు. పోలింగ్ రోజున కూడా ప్రజలు స్పందించి అభివృద్ధి కోసం, మంచి కోసం వైకాపాకు కట్టం కట్టాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సింగం వెంకటేశ్వర్ రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి, కేకే, తదితరులు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో రూ. 20 లక్షలతో కట్ గ్రానైట్ ఫ్లోరింగ్ కు ఏజీఎన్ జ్యువెలరీస్ అధినేతల ఉదారత



**మహానంది అక్టోబర్ 17 (నంది పత్రిక):–** ప్రముఖ శైవక్షేత్రమైన నంద్యాలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు, ఏజీఎన్ జ్యువెలరీస్ అధినేతలు అవ్వారు గౌరినాథ్, సరస్వతి దంపతులు క్షేత్ర అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు ప్రతిపాదించారు. మహానంది క్షేత్రంలోని మహానందీశ్వరాలయం, కామేశ్వరి దేవి ఆలయం, మరియు కోదండరామాలయం ప్రాంగణాల్లో ప్రస్తుతం ఉన్న పాత బండల స్థానంలో రూ. 20 లక్షలకు పైగా సొంత నిధులతో కట్ గ్రానైట్ రాళ్లను అమర్చేందుకు ఈ దంపతులు ముందుకు వచ్చారు. పురాణ ప్రాశస్త్యం కలిగిన ఈ క్షేత్ర ఔన్నిత్యాన్ని, ఆలయ విశిష్టతను ప్రతిబింబించేలా ఈ పనులను చేపట్టనున్నారు. ఈ మేరకు పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ, వారు భక్తిశ్రద్ధలతో కూడిన వినతి పత్రాన్ని మహానంది దేవస్థానం ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

# ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళిపై సంపూర్ణ అవగాహనతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలి:

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 17 నంది పత్రిక**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లాలో ఎక్కడ చిన్న సమస్య తలెత్తినా అది మొత్తం ఎన్నికల నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఎన్నికల విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబరు 3వ తేదీన పోలింగ్, నవంబరు 5వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల విధులకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా సుమారు 7,500 మంది సిబ్బంది అవసరమవుతారని తెలిపారు. ఎన్నికల విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరికీ తమ బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ఎన్నికల విధులు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రతి ఎన్నికను ప్రత్యేకమైనదిగా పరిగణించి మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణ పట్ల ప్రతి అధికారి, సిబ్బంది పూర్తి నిబద్ధతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, విధివిధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలు, అధికార పరిధి, అనుసరించాల్సిన విధానాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణలో వివరించిన ప్రతి అంశాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకుని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రతి అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో సున్నితమైన అంశాలు, భావోద్వేగాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎక్కడైనా చిన్న సమస్య తలెత్తినా, దాని ప్రభావం జిల్లా మొత్తం ఎన్నికల నిర్వహణపై పడే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ఏజెంట్లకు నిబంధనల ప్రకారం అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయడంతో పాటు, ఎన్నికలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల విధులపై శిక్షణ అందించే ట్రైనర్లు ప్రతి నియమాన్ని, విధివిధానాన్ని స్పష్టంగా వివరించాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో సంబంధిత మండల అధికారులు, ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఎదురైతే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి, సిబ్బంది సమన్వయంతో పనిచేసి, పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు వరకు అన్ని దశలను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ పి. ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగ అభివృద్ధి, నేతన్నల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి



### చేనేత జౌళి శాఖ అధికారులతో సమీక్ష
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 17 నంది పత్రిక** భీమవరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేనేత రంగం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం, వారికి అందిస్తున్న ప్రభుత్వ పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందుతున్న తీరుపై అధికారులతో చర్చించారు. చేనేత కార్మికుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, నేతన్నలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధికి, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి అమలు చేస్తున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ కె అప్పారావు, డిప్యూటీ డైరెక్టర్ కె పెద్దిరాజు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ఆళ్లగడ్డ లో రెండవ రోజున 81 నామినేషన్లు..



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 17 నంది పత్రిక** ఆళ్లగడ్డ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా రెండవ రోజున 81 నామినేషన్లు దాఖలు అయినట్లు మున్సిపల్ కమిషనర్, సహాయ ఎన్నికల అధికారి పి కిశోర్ తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ టీడీపీ కి సంబంధించి 39 వైసిపీ 44 నామినేషన్లు రావడం జరిగిందన్నారు. రేపటితో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని కమిషనర్ కిషోర్ వివరించారు. స్వేచ్ఛాయుత వాతావరణం లో ప్రతి ఒక్కరు నామినేషన్లు వేసుకోవాలని కమిషనర్ కిషోర్ వివరించారు, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఆళ్లగడ్డ డి.ఎస్.పి రవికుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు

# సరస్వతీ మాతగా భద్రకాళి అమ్మవారి దర్శనం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం..
- కోటి రూపాయలతో తయారైన 27 అడుగుల రథం సమర్పణ
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు..
- ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు



వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఏడవ రోజుకు చేరుకున్నాయి. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం అర్చకులు అమ్మవారిని సరస్వతీ మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే సాధకులకు సకల విద్యలు, జ్ఞానం లభిస్తాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**వైభవంగా రథసేవ** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి రథసేవ నిర్వహించారు. శరీరాన్ని రథంతో పోలుస్తారని, అమ్మవారి రథాన్ని లాగడం ద్వారా జీవనరథం సజావుగా సాగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ నమ్మకంతో భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగేందుకు ఉత్సాహం చూపించారు. నవరాత్రి కల్పాన్ని అనుసరించి కాలరాత్రి, రక్తబీజహా దుర్గా క్రమంలో అమ్మవారికి పూజారాధనలు నిర్వహించారు. భక్తుల భద్రకాళి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

**నేడు భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం**ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా భద్రకాళి అమ్మవారి జన్మోత్సవాన్ని నిర్వహించనున్నారు. దుర్గ భద్రకాళిగా కోటి యోగినీ గణాలతో అమ్మవారు ఆవిర్భవించిన పవిత్ర దినంగా దీనిని భావిస్తారు. దుర్గాష్టమి రోజున బతుకమ్మ పండుగలో భాగంగా సద్దులు సమర్పించడం కూడా తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని ఆలయ వర్గాలు తెలిపాయి.

**అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు**

తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక నవరాత్రి పూజలు నిర్వహించారు.

పూజల అనంతరం ఆలయ మహామండపంలో మహదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

**కోటి రూపాయలతో 27 అడుగుల రథం సమర్పణ**

శ్రీ భద్రకాళి దేవస్థానానికి భక్తుల సమర్పణగా కోటి రూపాయల వ్యయంతో ప్రత్యేకంగా తయారు చేయించిన 27 అడుగుల ఎత్తైన నూతన రథాన్ని మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో దేవస్థానానికి అప్పగించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, వారి బంధుమిత్రుల సహకారంతో ఈ రథాన్ని తయారు చేయించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. నూతన రథం సమర్పణతో ఆలయ ఉత్సవాలకు మరింత వైభవం చేకూరనుంది.

**ఉభయదాతలుగా పలువురు భక్తులు**

ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా హైదరాబాద్‌కు చెందిన శారదా విద్యా సంస్థల అధినేతలు సందిపూడి రవిశంకర్‌మానస దంపతులు, నాగభూషణంశ్రీదేవి దంపతులు, డాక్టర్ బి. వెంకటేశ్వర్లుసునీత దంపతులు, డాక్టర్ బి. సనత్‌కుమార్, డాక్టర్ సాహితి దంపతులు, డాక్టర్ బి. వైష్ణవి, జోశ్యుల కామేశ్వరశర్మకిరణ్మయి దంపతులు వ్యవహరించారు.

**ప్రముఖుల హాజరు**

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్‌కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్‌బాబు, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాసరావు,

రమేష్‌చంద్ భంగ్, మోతుకూరి మయూరి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మాజీ ధర్మకర్తలు జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్, గాండ్ల స్రవంతి, పాలడుగుల అంజనేయులు తదితరులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ జోగినపల్లి సంతోష్‌కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్, నాగుర్ల వెంకటేశ్వర్లు, కె. వాసుదేవరెడ్డి తదితర ప్రముఖులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

# 3 ఏండ్లలో తెలంగాణకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు

- పొంగులేటి కాంట్రాక్టులు వచ్చే వాటి గురించి రివ్యూ పెడతారు తప్ప, ప్రజా సమస్యల పరిష్కారానికి రివ్యూ ఉండదు
- ఓరుగల్లుకు చెందిన మంత్రులు ఉన్నా... ఇన్‌చార్జ్ పెత్తనం నడుస్తోంది
- కేసీఆర్ జమానాలో ఎమ్మెల్యేనే నియోజకవర్గానికి బాస్
- గ్రాడ్యుయేట్ ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పని చేయాలి
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
- కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై మూడేళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నాం
- అణచివేతలను, కేసులను దాటుకొని ప్రజా ఉద్యమాలు చేస్తున్నాం
- ప్రజలకు ఏ కష్టం వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది
- రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుంది
- గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం ఇప్పటికే పార్టీ తరపున డివిజన్ల వారీగా హెల్ప్‌లైన్ సెంటర్లు
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్స్ ఎక్కువ ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ
- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్,




ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అధ్యక్షతన బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై దిశానిర్దేశం చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ఓటరు నమోదు కీలకమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ ముఖ్య అతిథి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి వారి చుట్టుపక్కల ఉన్న పట్టభద్రులను గుర్తించాలని, వారి ఓటు నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు మనసుపెట్టి పనిచేస్తే మూడు రోజుల్లోనే పెద్ద సంఖ్యలో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయవచ్చని అన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని, కేసీఆర్ నాయకత్వంలో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రాంతంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర రంగాలకు చెందిన పట్టభద్రులు అధిక సంఖ్యలో ఉన్నందున వారిని సంప్రదించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టభద్రులతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, వారిని ఓటర్లుగా నమోదు చేయించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. హనుమకొండ బీఆర్ఎస్ పార్టీకి గుండెకాయ లాంటిదని పేర్కొంటూ, ఇక్కడి నుంచి ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బంధీగా నిర్వహించాలని కోరారు. పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించే అవకాశాలున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఇక రాజకీయాల విషయానికి వస్తే... 3 ఏండ్లలో తెలంగాణకు కాంగ్రెస్ చేసిందేమీ లేదని అన్నారు. ఇక్కడ పొంగులేటి కాంట్రాక్టులు వచ్చే వాటి గురించి రివ్యూ పెడతారు తప్ప, ప్రజా సమస్యల పరిష్కారానికి రివ్యూ ఉండదని విమర్శించారు. ఓరుగల్లుకు చెందిన మంత్రులు ఉన్నా... ఇన్‌చార్జ్ మంత్రి పెత్తనం నడుస్తోందని తప్పుబట్టారు. స్వయంగా ఎంపీ ఎన్నికల సమయంలో హనుమకొండ చౌరస్తాకు వచ్చి రెండు హామీలు ఇస్తే వాటిపై సమాధానం ఇవ్వాలని మండలిలో అడిగితే మంత్రులే తమకు తెలియదని చెప్పారన్న విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ గారి జమానాలో ఎమ్మెల్యేనే నియోజకవర్గానికి బాస్ అని, నేను నియోజకవర్గానికి నిధులు కావాలన్నా ఎవరో దయతలిస్తే తప్ప నిధులు విడుదల కాని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై మూడేళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హనుమకొండ పట్టణంలో తనపై, మా పార్టీ శ్రేణులపై అణచివేతలను, కేసులను అవుతున్నాయని, వాటిని దాటుకొని ప్రజా ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్న విశ్వాసం ప్రజల్లో ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని స్పష్టం చేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం ఇప్పటికే పార్టీ తరపున డివిజన్ల వారీగా హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్స్ ఎక్కువ ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ సైతం రూపొందించామని, ఆ దిశగా పని చేస్తామని అన్నారు. కాగా పార్టీ ఆదేశాల మేరకు ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఓటరు నమోదును పెద్ద ఎత్తున చేపట్టామని తెలిపారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలంతా మళ్లీ కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ సమాజం ఇప్పటికే కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటోందని అన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తి ప్రభావం చూపి, బీఆర్ఎస్ పార్టీ తిరిగి రాష్ట్రంలో అధికారం దక్కేందుకు అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకపోవడానికి కారణంగా బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందన్న భయమే ఎన్నికల ఆలస్యానికి కారణం అని అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ నాకు వద్దు అంటే నాకు వద్దని కాంగ్రెస్ నాయకులే వెనక్కి వెళ్లారని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న దయనీయ పరిస్థితికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో తాను స్వల్ప తేడాతో ఓటమి పాలైనప్పటికీ, గట్టి పోటీ ఇచ్చానని తెలిపారు. నిరుద్యోగుల పోటీ పరీక్షల్లో అవినీతి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ పోరాటం సాగించానని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 12 నియోజకవర్గాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి అర్హులైన పట్టభద్రులను నమోదు చేయించాలని సూచించారు. పండుగలు, ఇతర సందర్భాల్లో స్వగ్రామాలకు వచ్చే పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి గ్రాడ్యుయేట్ ఓటర్ల మద్దతు కీలకమని, అందువల్ల ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని సమష్టిగా పనిచేయాలని కోరారు.

దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ... గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కోరారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించడం, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర వృత్తుల్లో ఉన్న గ్రాడ్యుయేట్లను సంప్రదించడం వంటి అంశాలపై దృష్టి సారించి ఓటరు నమోదు చేయిద్దామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి పట్టభద్రుడిని చేరుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి ఓటరు నమోదు కార్యక్రమాన్ని పునాదిగా మలచుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ 3 ఏండ్ల పాలన ప్రజలను గోస పెడుతోందని, అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. పార్టీగా మనమందరం కలిసి కట్టుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేసేందుకు కృషి చేద్దామని కోరారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, రాష్ట్ర స్థాయి నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం తాత్కాలిక నిలుపుదల

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 17 నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లాలో మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ప్రతి వారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల అనంతరం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని యథావిధిగా తిరిగి నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలందరూ గమనించి, సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు

## ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి

### దేవాలయాల ఆస్తుల పరిరక్షణ, పారదర్శక పాలనకు కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 17 నంది పత్రిక**పశ్చిమ గోదావరి జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ దేవాదాయ శాఖ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.జిల్లా ఎండోమెంట్ అధికారిగా నియమితులైన వి. వెంకటేశ్వరరావు శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వి. వెంకటేశ్వరరావు గతంలో కాకినాడ జిల్లాలో పనిచేస్తూ, అక్కడి నుంచి భీమవరం జిల్లా ఎండోమెంట్ అధికారిగా బదిలీపై వచ్చారు. ఇంతకుముందు పశ్చిమ గోదావరి జిల్లా ఎండోమెంట్ అధికారిగా పనిచేసిన సూర్య ప్రకాష్, మావుళ్లమ్మ తల్లి ఆలయ కార్యనిర్వహణాధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆలయాల ఆస్తుల పరిరక్షణకు, పారదర్శకమైన పాలనకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

## మహాలక్ష్మీ దేవీ అవతారంలో జగన్మాత ---ఇంద్రకీలాద్రిపై భక్తిభావం

### శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో కనకదుర్గమ్మ దర్శనం




**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 17 నంది పత్రిక** విజయవాడ: “జై దుర్గా భవానీ.. జై జై మహాలక్ష్మీ!” అమ్మవారి నామస్మరణతో ఇంద్రకీలాద్రి మార్మోగుతోంది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏడో రోజైన శనివారం శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. సిరిసంపదలు, సౌభాగ్యం, సుఖసంతోషాలు ప్రసాదించే జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు.మహాలక్ష్మీ స్వరూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వ్యాపారాలు అభివృద్ధి చెందాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని జగన్మాతను ప్రార్థిస్తున్నారు.

**అష్టైశ్వర్య ప్రదాయిని మహాలక్ష్మి** మహాలక్ష్మీదేవిని ఐశ్వర్యం, ధాన్యసంపద, సౌభాగ్యం, శుభప్రదానికి ప్రతీకగా భక్తులు ఆరాధిస్తారు. ధనం మాత్రమే కాకుండా ఆరోగ్యం, ధైర్యం, జ్ఞానం, కుటుంబ సౌఖ్యం వంటి సర్వశుభాలను ప్రసాదించే తల్లిగా కొలుస్తారు. అమ్మవారి కరుణాకటాక్షాలు తమ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు మనసారా వేడుకుంటున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తుతోంది. జగన్మాత దివ్యదర్శనం కోసం వచ్చిన భక్తులు అమ్మవారి నామస్మరణతో మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## భక్తిశ్రద్ధల నడుమ ధీమంత్ సాయి ఇరుముడి కార్యక్రమం.

### గొల్లపూడి అయ్యప్పస్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక సందడి.

### కార్యక్రమంలో పాల్గొన్న మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు , మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ , శిరీష



**, విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 17 నంది పత్రిక** విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ తనయుడు ధీమంత్ సాయి ఇరుముడి కట్టే కార్యక్రమం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరిగింది. అయ్యప్పస్వామి నామస్మరణలు, “స్వామియే శరణం అయ్యప్ప” నినాదాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.అయ్యప్పస్వామి దీక్షలో ఇరుముడి కట్టుకోవడం అత్యంత పవిత్రమైన ఘట్టం. దీక్షా నియమాలను పాటిస్తూ, స్వామివారిపై సంపూర్ణ భక్తివిశ్వాసాలతో ధీమంత్ సాయి గొల్లపూడి అయ్యప్పస్వామి దేవాలయంలో ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం ఇరుముడిని శబరిమలలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి వారికి సమర్పించేందుకు యాత్రగా బయలుదేరారు. ఈ పవిత్ర కార్యక్రమంలో మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు , మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ , ఆయన సతీమణి శ్రీమతి శిరీష పాల్గొని ధీమంత్ సాయికి ఆశీస్సులు అందించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కూడా పాల్గొని అయ్యప్పస్వామి కృపాకటాక్షాలు ఆయనపై ఉండాలని ప్రార్థించారు. భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా సాగిన ఈ కార్యక్రమం భక్తుల నామస్మరణల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో ఘనంగా జరిగింది.



# వెంటనే డిలీట్ చేయండి.. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవు: నటి నేహా శర్మ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన ఫొటోలు, వీడియోలను అనధికారికంగా వాడుతున్న వారిపై బాలీవుడ్ హీరోయిన్ నేహా శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా సృష్టించిన ఏఐ కంటెంట్ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని, ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "నా ఫొటో లేదా పోలికలతో ఏఐ వీడియోలు, ఇమేజ్‌లు సృష్టిస్తున్న వారు వెంటనే ఆపాలి. ఇప్పటికే పోస్ట్ చేసిన కంటెంట్‌ను తక్షణమే తొలగించండి. నా గుర్తింపును ఉపయోగించి కొత్తగా ఎలాంటి ఏఐ కంటెంట్‌ను తయారుచేయవద్దు, ఎడిట్ చేయవద్దు, సర్క్యులేట్ చేయవద్దు" అని ఆమె స్పష్టం చేశారు.

'ఈ విధంగా నా ముఖాన్ని ఉపయోగించి నన్ను తప్పుగా చిత్రీకరించడం లేదా నా ప్రతిష్ఠ దెబ్బతీయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నా ముఖాన్ని లేదా పోలికలను అనధికారికంగా ఉపయోగించడానికి నేను అంగీకరించను. ఈ పోస్ట్‌ను అధికారిక హెచ్చరికగా పరిగణించండి. ఇలాంటి కంటెంట్‌ను సృష్టించిన, పోస్ట్ చేసిన, సర్క్యులేట్ చేసిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. ఫేక్ అకౌంట్లు లేదా ఏఐ టెక్నాలజీ వెనుక దాక్కుంటే శిక్ష నుంచి తప్పించుకోలేరు" అని నేహా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో నేహా శర్మ హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.






## వెంటనే డిలీట్ చేయండి- లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవు: నటి నేహా శర్మ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన ఫొటోలు, వీడియోలను అనధికారికంగా వాడుతున్న వారిపై బాలీవుడ్ హీరోయిన్ నేహా శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా సృష్టించిన ఏఐ కంటెంట్ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని, ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "నా ఫొటో లేదా పోలికలతో ఏఐ వీడియోలు, ఇమేజ్‌లు సృష్టిస్తున్న వారు వెంటనే ఆపాలి. ఇప్పటికే పోస్ట్ చేసిన కంటెంట్‌ను తక్షణమే తొలగించండి. నా గుర్తింపును ఉపయోగించి కొత్తగా ఎలాంటి ఏఐ కంటెంట్‌ను తయారుచేయవద్దు, ఎడిట్ చేయవద్దు, సర్క్యులేట్ చేయవద్దు" అని ఆమె స్పష్టం చేశారు. "ఈ విధంగా నా ముఖాన్ని ఉపయోగించి నన్ను తప్పుగా చిత్రీకరించడం లేదా నా ప్రతిష్ఠ దెబ్బతీయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నా ముఖాన్ని లేదా పోలికలను అనధికారికంగా ఉపయోగించడానికి నేను అంగీకరించను. ఈ పోస్ట్‌ను అధికారిక హెచ్చరికగా పరిగణించండి. ఇలాంటి కంటెంట్‌ను సృష్టించిన, పోస్ట్ చేసిన, సర్క్యులేట్ చేసిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. ఫేక్ అకౌంట్లు లేదా ఏఐ టెక్నాలజీ వెనుక దాక్కుంటే శిక్ష నుంచి తప్పించుకోలేరు" అని నేహా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో నేహా శర్మ హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

## వెంకీ 'ఆదర్శ కుటుంబం' రిలీజ్ డేట్‌పై సస్పెన్స్ వీడింది.. కానీ ఓ ట్విస్ట్!

టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదలపై నెలకొన్న గందరగోళానికి ఎట్టకేలకు తెరపడింది. వరుస వాయిదాలతో సతమతమవుతున్న ఈ సినిమా విడుదల తేదీపై నిర్మాత సూర్యదేవర నాగవంశీ పూర్తి స్పష్టతనిచ్చారు. అయితే, ఈసారి తనదైన శైలిలో చమత్కార వ్యాఖ్యలు జోడించి, ప్రకటన బాధ్యతను హీరో వెంకటేశ్‌కే అప్పగిస్తున్నట్లు తెలిపారు.'జైలర్ 2' ప్రెస్ మీట్ సందర్భంగా 'ఆదర్శ కుటుంబం' విడుదల గురించి నాగవంశీ మాట్లాడారు. ముందుగా అనుకున్నట్లే సినిమా అక్టోబర్ 30న థియేటర్లలోకి వస్తుందని పరోక్షంగా ధ్రువీకరించారు. అయితే, వరుస వాయిదాల నేపథ్యంలో తనపై తానే సెటైర్లు వేసుకున్నారు. "గతంలో సినిమా వాయిదా వేసినప్పుడు, అక్టోబర్ 30న వస్తున్నారా అని మీడియా మిత్రులు అడిగారు. మీరు ఊహించిన తేదీకే సినిమా రావడం ఖాయం. కానీ, ఈసారి ఆ తేదీని నేను అధికారికంగా ప్రకటించను. ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేయడంతో, ఇప్పుడు మళ్లీ నేనే చెబితే జనాలు నమ్మరు, పైగా తంతారేమో" అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించడంతో ప్రెస్‌మీట్‌లో నవ్వులు పూశాయి.ఈసారి ఎలాంటి గందరగోళానికి తావివ్వకుండా, పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు నాగవంశీ వివరించారు. "ప్రస్తుతం వెంకటేశ్ గారు ఊటీలో షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన హైదరాబాద్‌కు తిరిగి రాగానే, అక్టోబర్ 21 లేదా 22 తేదీల్లో భారీ స్థాయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించబోతున్నాం. ఆ వేదికపై స్వయంగా వెంకటేశ్ గారే అభిమానుల సమక్షంలో విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తారు" అని స్పష్టం చేశారు.



# 'జనవరి 12 విడుదల'లో కీర్తి సురేశ్ పాత్ర ఇదే పుట్టినరోజున కీలక అప్‌డేట్!



విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త సినిమా 'జనవరి 12 విడుదల'. ఈ సినిమాలో కీర్తి సురేశ్ పోషిస్తున్న పాత్ర పేరును దర్శకుడు తాజాగా వెల్లడించారు. అక్టోబర్ 17న కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ.. సినిమాలో ఆమె 'లతా రెడ్డి'గా కనిపించనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.కీర్తి సురేశ్‌లోని ప్రత్యేకమైన ఉత్సాహం, ఆప్యాయత, సహజమైన నటన 'లతా రెడ్డి' పాత్రకు మరింత అందాన్ని తీసుకొస్తాయని అనిల్ రావిపూడి పేర్కొన్నారు. ఈ ప్రకటనతో సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగింది. ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్‌రామ్ సరసన కృతి శెట్టి కనిపించనున్నారు.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా సాగుతోంది. ఇటీవలే తమిళనాడులోని ఊటీలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించారు. అంతకుముందు మైసూరులో చిత్రీకరణ జరిపారు. అక్కడ నలుగురు ప్రధాన నటీనటులపై కీలక సన్నివేశాలతో పాటు ఓ పాటను కూడా తెరకెక్కించినట్లు సమాచారం. ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఆమె కొరియోగ్రఫీలో దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత భాగం కావడం ఆనందంగా ఉందని నటుడు శ్రీమాన్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.ఈ చిత్రంలో వెంకటేశ్ లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల ఆయన సినీ ప్రయాణంలో 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. భారత సైన్యంలో పనిచేసే అధికారి, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, బందీలను విడిపించే చర్చల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తిగా ఆయన పాత్రను పరిచయం చేశారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమాను సురేశ్ ప్రొడక్షన్స్ అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం, తమ్మిరాజు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ఈ సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.



# బిజినెస్

## మళ్లీ భగ్గుమన్న ముడి చమురు ధరలు.. బ్యారెల్ 110 డాలర్లకు బ్రెంట్ క్రూడ్!

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరిగాయి. సరఫరా సమస్యలు త్వరలో తీరుతాయన్న ఆశలు సన్నగిల్లడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 డాలర్లకు చేరువైంది. మే నెల తర్వాత ఈ స్థాయిని తాకడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య దాడులు చమురు సరఫరాపై ఆందోళనలను పెంచుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 109.69 డాలర్లకు చేరింది. గత ముగింపుతో పోలిస్తే ఇది 3.56 శాతం అధికం. అంతర్జాతీయంగా సరఫరా పరిస్థితులు బలహీనంగా ఉండటంతో ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాలతో ట్రేడర్లు కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు. సౌదీ అరేబియాపై ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతున్నాయి. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ పరస్పరం ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేసుకుంటున్నాయి. రష్యాలోని ర్యాజాన్ చమురు శుద్ధి కర్మాగారంపై దాడి జరిగినట్లు వచ్చిన వార్తలతో అక్కడ కార్యకలాపాలు నిలిచిపోయినట్లు సమాచారం. ఈ పరిణామాలు చమురు సరఫరాపై ఒత్తిడిని పెంచుతున్నాయి. రష్యా నిల్వల నుంచి వందల మిలియన్ల బ్యారెళ్ల డీజిల్ కొనుగోలుకు ప్రతిపాదించిన ఒప్పందాన్ని అడ్డుకునేందుకు అమెరికా చట్టసభ సభ్యులు శుక్రవారం బిల్లును ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందం రష్యా యుద్ధానికి ఆర్థికంగా తోడ్పడుతుందన్న ఆందోళనను వారు వ్యక్తం చేశారు. మరోవైపు, నవంబర్ 3 ఎన్నికల తర్వాత ఇరాన్‌పై 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' వినియోగించే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చలేదని న్యూస్‌మాక్స్ కథనం పేర్కొంది. 2026 డిసెంబరులో బ్రెంట్ క్రూడ్ ధర 90 డాలర్లకు



చేరవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. గతంలో వేసిన 85 డాలర్ల అంచనాను పెంచింది. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి చివర్లో బ్రెంట్ ధర సుమారు 70 డాలర్లుగా ఉంది. హర్మూజ్ జలసంధిలో రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో అది 125 డాలర్లకు పైగా ఎగసింది. ఆ తర్వాత తగ్గిన ధరలు ఇప్పుడు మళ్లీ 110 డాలర్ల స్థాయికి చేరువయ్యాయి.

## దుబాయ్‌లో జోయాలుక్కాస్ ని 'జువెల్ ఆఫ్ జాయ్' షోరూమ్



హైదరాబాద్: జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్‌లో 'జువెల్ ఆఫ్ జాయ్' పేరుతో అతిపెద్ద జువెలరీ షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ నెల 18న ఈ షోరూమ్‌ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) విదేశీ వాణిజ్య శాఖ మంత్రి థానీ బిన్ అహ్మద్ అల్ జైదీ అధికారికంగా ప్రారంభించనున్నట్లు జోయాలుక్కాస్ వెల్లడించింది. 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్ పశ్చిమాసియాలో అతిపెద్దదని తెలిపింది. నాలుగు దశాబ్దాలుగా యూఏఈలో కార్యకలాపాలు సాగిస్తున్న జోయాలుక్కాస్ ఈ కొత్త షోరూమ్‌తో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనుందని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ తెలిపారు. అంతేకాకుండా అంత ర్జాతీయంగా తమ స్థానా న్ని మరింత పటిష్ఠం చేస్తుందన్నారు. ప్రీమియం వీఐపీ లాంజ్‌తో పాటు వినియోగదారులకు అద్భుతమైన షా పింగ్ అనుభవాన్ని కల్పించేందుకు ఈ షోరూమ్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు జోయాలుక్కాస్ వెల్లడించింది.

## టెస్లా రోడ్‌స్టర్ విన్యాసాలు వైరల్.. ఎగిరే కారుపై మీమ్స్‌తో నెటిజన్ల సందడి!

ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ వ్యాపార వేత్త ఎలాన్ మస్క్ కు చెందిన టెస్లా కంపెనీ మరోసారి సంచలన సృష్టించింది. ఇటీవల అక్టోబర్ 15న ఆవిష్కరించిన తన నూతన తరం 'రోడ్‌స్టర్' కారుతో టెస్లా మరోసారి ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. మస్క్‌కు చెందిన అంతరిక్ష సంస్థ 'స్పేస్‌ఎక్స్' అత్యాధునిక సాంకేతికతో అభివృద్ధి చేసిన రాకెట్-ప్రేరేపిత థ్రస్టర్ల సహాయంతో ఈ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కార్ గాలిలో స్వల్పంగా ఎగిరి అద్భుతమైన విన్యాసాలు చేసింది. అయితే, ఈ కారు నిజమైన విమానంలా నిరంతరం నింగిలో ప్రయాణించలేదని, కేవలం కొద్ది క్షణాల పాటు గాలిలోకి లేచేలా మాత్రమే దీన్ని డిజైన్ చేశామని కంపెనీ స్పష్టం చేసింది. అయినప్పటికీ, రోడ్‌స్టర్ కారు ప్రదర్శన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటోమొబైల్ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. మరోవైపు ఈ ప్రదర్శన వ్యక్తిగత రవాణా భవిష్యత్తుపై ఎన్నో ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ, ఆ కారు ధర, ఎగిరే దూరం, భద్రతా నియమాలపై ఇంకా అనేక సందేహాలు నెలకొన్నాయి. భారత్‌లాంటి దేశాల్లో ఇలాంటి కార్లు ఎలా వర్క్ అవుతాయనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు, 'రోడ్‌స్టర్' కారు ప్రదర్శనపై సోషల్ మీడియాలో ట్రోల్స్‌కు, ఫన్నీ మీమ్స్‌కు కేంద్రబిందువుగా మారింది. ఇది నిజంగానే ఎగిరే కారా లేక కేవలం స్టంటా అంటూ నెటిజన్లు రకరకాల జోకులు పేలుస్తున్నారు. సామాజిక మా వేదికగా ఫన్నీ వీడియోలు, మీమ్స్ విపరీతంగా వైరల్ అవుతున్నాయి. టెక్నాలజీ పరంగా ఒక గొప్ప అడుగుగా భావించిన ఈ



ప్రదర్శన, ప్రస్తుతం నెటిజన్లకు వినోదాన్ని పంచుతోంది.

## కోహ్లీ అహంకారిగా కనిపించడానికి కారణం అదే అసలు విషయం బయటపెట్టిన డివిలియర్స్





టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీపై దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తొలిసారి కలిసినప్పుడు కోహ్లీని అహంకారిగా, మితిమీరిన ఆత్మవిశ్వాసం ప్రదర్శించే వ్యక్తిగా భావించానని వెల్లడించాడు. అయితే, అది అతడి వ్యక్తిత్వంలోని మరో కోణమని, తన సామర్థ్యం పై ఉన్న బలమైన నమ్మకమే అలా కనిపించడానికి కారణమని వివరించాడు. కాలక్రమంలో కోహ్లీ వ్యక్తిత్వంలో మార్పు వచ్చిందని తెలిపాడు. ప్రఖర్ గుప్తాతో జరిగిన పాడ్‌కాస్ట్‌లో డివిలియర్స్ ఈ విషయాలను పంచుకున్నాడు. తొలిసారి కలిసినప్పుడు కోహ్లీని నిజంగానే 'అహంకారి, పొగరుబోతు'గా భావించారా? అని అడగ్గా.. "అవును, కోహ్లీ కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తాడు" అని సమాధానమిచ్చాడు. అయితే, తాను ఆ మాటలను సరదాగానే చెబుతుంటానని స్పష్టం చేశాడు. 19 నుంచి 21 ఏళ్ల వయసులో కోహ్లీ చాలా ఆత్మవిశ్వాసంతో ఉండేవాడని డివిలియర్స్ పేర్కొన్నాడు. తన సామర్థ్యంపై గట్టి నమ్మకం ఉండటమే అతడిని అలా చూపించిందని చెప్పాడు. కొన్నిసార్లు అలాంటి ఆత్మవిశ్వాసాన్ని ఇతరులు అహంకారంగా పొరబడతారని వివరించాడు. గొప్ప విజయాలు సాధించాలంటే తనపై తనకు నమ్మకం ఉండటం అవసరమని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీతో డివిలియర్స్‌కు మైదానం బయట కూడా మంచి అనుబంధం ఉంది. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున కలిసి ఆడిన సమయంలో వీరిద్దరి స్నేహం మరింత బలపడింది. అప్పటి నుంచి కోహ్లీ ఆటతీరుతో పాటు అతడి వ్యక్తిత్వాన్ని కూడా డివిలియర్స్ మరింతగా అభిమానిస్తూ వచ్చాడు. కోహ్లీ ఎదుగుతున్న కొద్దీ అతడిలోని ఆ అతివిశ్వాస భావన తగ్గిందని డివిలియర్స్ తెలిపాడు. వయసుతో పాటు వ్యక్తిగా, క్రికెటర్‌గా మరింత పరిణతి సాధించాడని చెప్పాడు. చిన్న వయసులో తనను తాను నిరూపిం చుకోవాలనే తపన కోహ్లీలో ఎక్కువగా ఉండేదని,
విజయాలు సాధించే కొద్దీ ఆ అవసరం తగ్గిందని వివరించాడు. తనపై నమ్మకాన్ని ఇతరుల ముందు అతిగా ప్రదర్శించాల్సిన అవసరం కూడా క్రమంగా తగ్గిపోయిందని పేర్కొన్నాడు.

## జైస్వాల్‌కు అన్యాయం జరిగింది.. సెలక్టర్లపై అశ్విన్ అసంతృప్తి

భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను న్యూజి లాండ్ పర్యటనకు వన్డే జట్టు నుంచి తప్పించడంపై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సెలక్టర్ల నిర్ణయం అన్యాయమని, దురదృష్టకరమని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ సెలక్షన్ కమిటీ తీరును తప్పుబట్టారు. న్యూజిలాండ్ పర్యటనలో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా చివరి రెండు మ్యాచ్‌లకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతినిచ్చారు. ఈ నేపథ్యంలో గిల్ స్థానం లో యశస్వి జైస్వాల్‌కు అవకాశం ఇచ్చి ఉండా ల్సిందని అశ్విన్ వాదించారు. "శుభ్‌మన్ గిల్ చివరి రెండు వన్డేలు ఆడకపోతే, ఆ స్థానం కచ్చితంగా యశస్వి జైస్వాల్‌కు దక్కాలి. ఇలా జరగడం చాలా దురదృష్టకరం" అని అశ్విన్ పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా జైస్వాల్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఏ ఫార్మాట్‌లోనూ మ్యాచ్ ఆడలేదని అశ్విన్ గుర్తుచేశారు. "ఒకప్పుడు అతను పరుగుల యం త్రంలా ఆడాడు. ఇలాంటి పరిస్థితులు ఆటగాడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ప్రతిభా వంతులైన ఆటగాళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత టీమ్ మేనేజ్‌మెంట్, సెలక్టర్లపై ఉంటుంది" అని ఆయన హితవు పలికారు. అక్టోబర్ 22 నుంచి ప్రారం భమయ్యే న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. వన్డే జట్టులో చోటు



దక్కించుకోలేకపోయిన జైస్వాల్, టెస్టు సిరీస్‌కు మాత్రం ఎంపికయ్యాడు.

# స్పోర్ట్స్

## గంగూలీ, యువరాజ్, వాస్.. ఢిల్లీ క్యాపిటల్స్‌కు కొత్త రూపు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) జట్టు, రాబోయే సీజన్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ క్రమంలో తమ కోచింగ్ సిబ్బందిని పూర్తిగా ప్రక్షాళన చేసింది. భారత క్రికెట్ దిగ్గజాలతో కూడిన శక్తిమంతమైన కోచింగ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని హెడ్ కోచ్‌గా నియమించగా, విధ్వంసకర ఆల్-రౌండర్ యువరాజ్ సింగ్ బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. తాజాగా శ్రీలంక ఫాస్ట్ బౌలింగ్ దిగ్గజం చమిందా వాస్‌ను ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా నియమిస్తూ ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకుంది. చమిందా వాస్‌కు కోచ్‌గా విశేష అను భవం ఉంది. గతంలో ఆయన శ్రీలంక జాతీయ జట్టుకు, ఎస్ఎల్‌సీ అకాడమీకి పలుమార్లు కోచ్‌గా పనిచేశారు. న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లకు కన్సల్టె ంట్‌గా కూడా సేవలందించారు. ఆయనతో పాటు ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరైన భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా కూడా డీసీ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా చేరనున్నట్లు సమాచారం. గతేడాది అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన మిశ్రాకు ఇదే తొలి కోచింగ్ బాధ్యత కానుంది. ఇప్పటికే జేఎస్‌డబ్ల్యూ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న సౌరవ్ గంగూలీ, ఇప్పుడు హెడ్ కోచ్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ ఏడాది దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్‌కు హెడ్ కోచ్‌గా పనిచేసి కోచింగ్‌లో అడుగుపెట్టారు. ఇక, యువరాజ్ సింగ్ తన అనుభవాన్ని శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, రిషబ్ పంత్ వంటి యువ ఆటగాళ్లకు మెంటార్‌గా పంచుకున్న విషయం తెలిసిందే.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com